ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

శుక్రవారం 30 మే 2025





“దేవునిగడప అయిన కడపలో బహిరంగసభ సూపర్‌హిట్ అయింది. నేను ఎన్నో మహానాడులు చూశాను, కడప మహానాడు చరిత్ర సృష్టించింది. ఇది నా జీవితంలో మరిచిపోలేను. నిన్న జరిగిన ఎన్నికల్లో పదికి ఏడు గెలిపించారు. ఈ సారి బాగా కష్టపడితే పదికి పది వస్తాయి. సిద్ధమా తమ్ముళ్లూ సిద్ధమా.. అని” చంద్రబాబు అనగా సిద్ధం.. సిద్ధం అంటూ కేడరు జెండాలు ఎత్తుతూ సమాధానం ఇచ్చారు.

వరాలజల్లు..!





మహానాడుకు హాజరైన అశేష జనవాహినికి లోకేశ్ అభివాదం

- ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం
- గాలేరు-నగరికి రూ.వెయ్యి కోట్లు
- గండికోట అభివృద్ధి
- సోమశిల నుంచి బద్వేలుకు నీరు
- కడప తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు
- మహానాడు వేదికగా ప్రకటించిన సీఎం
- బహిరంగ సభ బంపర్ హిట్
- లక్షలాదిగా తరలివచ్చిన జనం

దేవునికడప గడ్డపై నిర్వహించిన మహానాడు వేదికగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లావాసులపై వరాలజల్లు కురిపించారు. మహానాడులో భాగంగా చివరిరోజైన గురువారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు లక్షలాది జనం తరలివచ్చారు. రాష్ట్రంలోని దారులన్నీ కడపవైపు అన్నట్లుగా సాగాయి. మహానాడు వేదికతో పాటు కడప చుట్టూ ఉన్న రింగురోడ్డంతా వాహనాలన్నీ బారులుతీరాయి. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పదిరోజుల్లో రూ.4500 కోట్లతో మొదటి దశ స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు మొదలు పెడతామని ప్రకటించారు. పనులే కాదు ఫ్యాక్టరీ కూడా తానే ప్రారంభిస్తానన్నారు. గాలేరు - నగరి ప్రాజెక్టును కడప వరకు తీసుకువచ్చేందుకు వెయ్యి కోట్లు ఇప్పుడే మంజూరు చేస్తున్నట్లు సభా వేదికపై ప్రకటించారు. ఇక ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ కెనాన్‌గా గుర్తింపబడిన గండికోటను అద్భుతంగా అభివృద్ధి చేసి నెంబర్ వన్ టూరిజం హబ్‌గా నిలుపుతామన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడ పనులను నెలరోజుల్లోనే మొదలుపెడతామన్నారు. సోమశిల ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ నీటిని బద్వేలుకు తీసుకువస్తామన్నారు. కడపలో తాగునీటి ఎద్దడి నివారణకు బుగ్గవంకను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గత టీడీపీ హయాంలో 90 శాతం పూర్తయిన హజ్‌హౌస్‌ను వైసీపీ ఐదేళ్లు పట్టించుకోలేదని.. ఆరు నెలల్లో కడప హజ్‌హౌస్ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన మహానాడు గ్రాండ్ సక్సెస్ అయింది. బహిరంగసభ నభూతో నభవిష్యత్ అన్నట్లుగా బంపర్‌హిట్ అయింది. మహానాడు కడప జిల్లా రూపురేఖలు మార్చడమే కాకుండా చిరకాల వాంఛలు కూడా నెరవేర్చేలా చేసింది. గురువారం నగర శివార్లలోని పబ్బాపురంలో భారీ బహిరంగసభ నిర్వహించారు. ఈ సభకు అశేష జనవాహిని హాజరైంది. ఎటు చూసినా జనం జనం.. వాహనాలే వాహనాలు. మూడురోజుల కిందటి వరకు కూడా వరుణదేవుడు రోజూ ఏదోఒక టైంలో వచ్చి పోయేవాడు. అయితే మహానాడు ప్రారంభమైన తరువాత వరుణుడు కడప వైపు చూడలేదు. చల్లని సాయంత్రం వేళ బహిరంగ సభ జరిగింది.

బహిరంగ సభ సాగిందిలా..

మహానాడు షెడ్యూలులో భాగంగా సాయంత్రం 4 గంటలకు బహిరంగసభ నిర్వహించాల్సి ఉంది. అయితే ఉత్తరాంధ్ర, కోస్తా, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి జనం తెల్లారేసరికి బస్సులు, ఇతర వాహనాల్లో మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నంలోపే వేదిక అంతా ఫుల్ అయింది. ఇటు రాయచోటి రింగురోడ్డు నుంచి ఇటు పులివెందుల రింగు రోడ్డు నుంచి మహానాడు వేదిక వరకు జనమే జనంగా కనిపించారు. బహిరంగసభ గ్రౌండ్, తొలి రెండురోజులు నిర్వహించిన ప్రతినిధుల సభ మైదానం వేదిక చుట్టూ ఉన్న గ్యాలరీల్లో ఎక్కడ చూసినా జనమే ఉన్నారు. దీంతో మధ్యాహ్నం 2గంటలకే టీడీపీ ముఖ్య నేతలంతా వేదికపై ఆశీనులయ్యారు. జిల్లా నేతల ప్రసంగాలు మొదలుపెట్టారు.

- 2.38 గంటలకు లోకేశ్ వేదికపై వచ్చారు. దీంతో గ్యాలరీలో ఉన్న శ్రేణులు జై లోకేశ్.. జై లోకేశ్ అంటూ విజిల్స్ వేస్తూ, కేకలతో జెండాలు ఎత్తుతూ ఘన స్వాగతం పలికారు. లోకేశ్ వేదిక పైనుంచి అభివాదం చేశారు. 3.47 గంటలకు లోకేశ్ స్పీచ్ మొదలై 4.07 గంటలకు ముగిసింది. తల్లిని, చెల్లిని గెంటేసిందెవరు ? బాబాయిని చంపిందెవరు? అంటూ జనాలను అడగ్గా.. జగన్ జగన్ అంటూ జనం సమాధానమిచ్చారు.
- ఎర్రబుక్ అంటూ ఏడుస్తున్నారు. రెడ్‌బుక్‌తో ఒకరికి గుండెపోటు వస్తే, మరొకరు బాత్‌రూములో పడి చేయి విరగ్గొట్టుకున్నాడు. మరొకడు.. ఏమైందో చూశారుగా అని లోకేశ్ అనగా, గ్యాలరీ నుంచి ఈలలు, కేకలు, చప్పట్లతో జై లోకేశ్ అంటూ నినాదాలు చేశారు.
- 3.13 గంటలకు సీఎం చంద్రబాబు వేదికపైకి వచ్చారు. ఈలలు, కేరింతలు, చప్పట్లు కొడుతూ ఆద్యంతం జెండాలు పట్టుకుని చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు కూడా అందరికీ అభివాదం చేశారు.
- 4.17 గంటలకు చంద్రబాబు బహిరంగసభ ప్రారంభమై 5.10 గంటలకు ముగించారు. సాధారణంగా బహిరంగసభ అంటే అరగంట ఆలస్యంగా మొదలవుతుంది. అయితే ఈ సభ 2 గంటలు ముందే మొదలైంది. పొద్దునకే గ్రౌండు నిండిపోయిందంటూ జనాన్ని చూసి చంద్రబాబు ఉప్పొంగిపోయారు. చంద్రబాబు మాట్లాడుతున్నప్పుడల్లా జై చంద్రబాబు, జై టీడీపీ, ఎన్టీఆర్ అంటూ జనం నినాదాలు చేశారు. గొడ్డలి పోటు రాజకీయాలు మనకొద్దు, క్లైమోర్‌మైన్ బాంబులకే భయపడలేదు. సమస్యలకు భయపడతానా అని చంద్రబాబు అనగా, గ్యాలరీలో నుంచి ఈలలు కేకలు ప్రతిధ్వనించాయి.
- నా కష్టం నాకోసం కాదు. నన్ను నమ్ముకున్న మీ కోసం. టీడీపీకి బీసీలు వెన్నెముక. టీడీపీ బీసీల పార్టీ అనగా గ్యాలరీలో నుంచి హర్షధ్వానాలు రేకెత్తాయి. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామనగా భారీ ఎత్తున స్పందన వచ్చింది.

అదిరిపోయిన ఏర్పాట్లు

మహానాడు ప్రతినిధుల కోసం చేసిన ఏర్పాట్లతో పాటు బహిరంగసభ ఏర్పాట్లు కూడా అదిరిపోయాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజన ఏర్పాట్లను ఐదుచోట్ల ఏర్పాటు చేశారు. బహిరంగసభ అనంతరం తిరుగు ప్రయాణంలో కూడా వెళ్లేవారి కోసం చిత్తూరు వైపు వెళ్లేవారి కోసం నీకేదిన్నె సమీపంలో, తిరుపతి వైపు వెళ్లే వారి కోసం నీకేదిన్నె పోలీసుస్టేషన్, కర్నూలు, ప్రకాశం, కోస్తా, ఉత్తరాంధ్ర వెళ్లే వారి కోసం ఖాజీపేట సమీపంలోని బీరంరెడ్డి విద్యాసంస్థలు, పులివెందుల వైపు వెళ్లే వారు యోగివేమన యూనివర్శిటీ, ఎర్రగుంట్ల మీదుగా వెళ్లే వారి కోసం వల్లూరు వద్ద భోజన ఏర్పాట్లు చేశారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చినప్పటికీ బహిరంగసభ అనంతరం ఎలాంటి ఆటంకాలు లేకుండా పోలీసులు దగ్గరుండి పర్యవేక్షించారు.



అభివృద్ధిలో తగ్గేదేలా.. అంటున్న నారా లోకేశ్



జనసంద్రంగా కడప

కడపలో మహానాడును టీడీపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఐదు లక్షల మందితో బహిరంగసభ నిర్వహించాలని గట్టిగా నిర్ణయించుకుంది. అయితే అందుకు తగ్గట్లుగానే గురువారం నిర్వహించిన బహిరంగసభ జనసంద్రంగా మారింది. కడప చరిత్రలో ఇంత పెద్ద బహిరంగసభ జరగలేదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఉమ్మడి కడప జిల్లాతో పాటు కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి కడప సమీపంలో ఉన్న 50 నియోజకవర్గాల నుంచి జన సమీకరణ చేశారు. సుమారు ఐదువేల వాహనాలను సమకూర్చారు. అయితే పార్టీ మీద అభిమానంతో సుదూర ప్రాంతాలైన గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లా, కర్నూలు, అనంతపురం, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి జనం చేరుకున్నారు. మధ్యాహ్నం లోపే మహానాడు వేదిక అంతా జనసంద్రంగా మారింది. బహిరంగసభ వేదికకు అటు రాయచోటి వైపు మూడు కి.మీ, కర్నూలు వెళ్లే రహదారిలో 3కిమీ మేర జనం రోడ్లపైనే నిలిచిపోయారు. జనం ఎక్కువ కావడం.. వాహనాలు రావడంతో పోలీసులు దూరంగానే వాహనాలు నిలిపివేశారు. గ్యాలరీలన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. ఇరువైపులా మైదానం, రింగురోడ్డు పొడవునా ఇసుకేస్తే రాలనంతగా జనం కనిపించారు. అశేష జనం తరలిరావడంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్, టీడీపీ నేతలంతా ఉబ్బితబ్బిబ్బయ్యారు.



కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి ఇచ్చిన చెర్నాకోలా, నాగలి చేత బట్టుకుని చిరునవ్వు చిందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



వేదికపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్న చంద్రబాబు



వేదికపై భావోద్వేగానికి గురైన పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డిని ఓదారుస్తున్న చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యే మాధవి



టీడీపీకి రూ.25 లక్షల విరాళం ఇచ్చిన బద్వేలు ఇన్‌చార్జి రితేశ్‌కుమార్ రెడ్డిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



మహానాడు సభలో నారా లోకేశ్‌తో టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

సాకారం దిశగా కడప ఉక్కు

- 12 లోపు పనులు ప్రారంభం
- తొలి దశలో రూ.4500 కోట్లు
- 3 వేల మందికి ఉద్యోగాలు
- నెరవేరనున్న జిల్లావాసుల చిరకాల వాంఛ



(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా చిరకాల వాంఛ అయిన స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణానికి మళ్లీ మంచి రోజులు వచ్చాయి. విభజన చట్టంలో భాగంగా కడపలో స్టీలు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని పొందుపరిచినప్పటికీ అది వీలు కాలేదు. 2018లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రాయలసీమ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి మైలవరం మండలంలో శంకుస్థాపన చేశారు. జగన్ సీఎం అయ్యాక మరో చోట రెండు సార్లు శంకుస్థాపన చేసి కట్టకుండానే చేతులెత్తేశారు. ఇప్పుడు మళ్లీ సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలోని ప్రభుత్వం పదిరోజుల్లోనే స్టీలు ఫ్యాక్టరీ పనులు మొదలుపెట్టనుంది. ఈ మేరకు మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు స్టీలు ఫ్యాక్టరీ గిఫ్టును జిల్లా వాసులకు ఇచ్చారు. జూన్ 12 నాటికి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతుంది. ఆ లోపే అంటే పదిరోజుల్లోనే జిందాల్ ఆధ్వర్యంలో స్టీలు ఫ్యాక్టరీ పనులు మొదలుకానున్నాయి. పనులు ప్రారంభించడమే కాదు ఫ్యాక్టరీని కూడా ప్రారంభిస్తామని చంద్రబాబు బహిరంగసభ సాక్షిగా హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లావాసుల్లో మరలా ఆశలు చిగురించాయి. రెండు విడతల్లో స్టీలు ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టనున్నారు. తొలివిడతలో రూ.4500 కోట్ల వ్యయంతో చేపడతారు. మూడువేల మందికి ఉద్యోగాలు వస్తాయి. అలాగే ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి లభిస్తుంది.

అలాగే కొప్పర్తి పారిశ్రామికవాడకు సంబంధించిన పనులు నెలరోజుల్లోనే టెండర్లు పూర్తి కానున్నాయి. ఇక్కడ మౌలిక వసతులు కల్పిస్తే పరిశ్రమలు క్యూకడతాయి. జిల్లా నుంచి ఎయిర్ కనెక్టివిటీ, రోడ్లు, ట్రైన్ కనెక్టివిటీ ఉన్నాయి. మెట్రో సిటీస్ అయిన బెంగళూరు, చెన్నై దగ్గరలో ఉన్నాయి. అలాగే క్రిష్ణపట్నం, చెన్నై పోర్టులు కూడా దగ్గరలో ఉన్నాయి. పరిశ్రమలకు అనువైన ప్రాంతం. ఇప్పటిదాకా నేతల్లో చిత్తశుద్ధి, పరిశ్రమల ఏర్పాట్లలో పర్సంటేజీల కారణంగా పారిశ్రామికవేత్తలు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపేవారు కాదు. చంద్రబాబు ప్రభుత్వం పరిశ్రమలకు పెద్దపీట వేస్తూ మౌలిక వసతుల్లో వారికి ప్రోత్సాహం ఇస్తుండడంతో పరిశ్రమలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కడప స్టీలు కూడా చంద్రబాబు హయాంలోనే నిర్మాణం పూర్తి చేసుకుంటుందన్న నమ్మకం జనాల్లో ఉంది. మొత్తానికి కడప మహానాడు సందర్భంగా జిల్లావాసులకు స్టీలు ఫ్యాక్టరీ గిఫ్టు ఇచ్చినట్లయింది.



చంద్రబాబు వరాలజల్లుతో జనోత్సాహం

రాజంపేటకు మంచిరోజులు

- అన్నమయ్య ప్రాజెక్టుకు చంద్రబాబు హామీ
- నిర్మాణం పూర్తయితే రాజంపేట సస్యశ్యామలమే..
- వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం.. పైసా విదిల్చని వైనం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడు బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నమయ్య ప్రాజెక్టు గురించి మాట్లాడారు. తమ హయాంలో అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని సభ సాక్షిగా ప్రకటించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన తర్వాత సుమారు రెండన్నర సంవత్సరాలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రాజెక్టు నిర్మాణం పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కనీసం పైసా కూడా విడుదల చేయలేదని తెలిపారు.

వైసీపీది అంతులేని నిర్లక్ష్యం..

1976లో ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో మొదలైన అన్నమయ్య ప్రాజెక్టు 2001లో ముఖ్యమంత్రి చంద్రబాబు కాలంలో పూర్తయింది. 2021 నవంబరు 19న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైసీపీ నాయకుల ఇసుక దోపిడీ కారణంగా వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ఈ దుర్ఘటనలో 40 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వేలాది పశువులు మృత్యువాత పడ్డాయి. వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. అన్నమయ్య ప్రాజెక్టు వల్ల ప్రధానంగా రాజంపేట, పుల్లంపేట మండలాలకు సుమారు లక్ష మందికి తాగునీరు అందేది. రాజంపేట నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల్లో 22,500 ఎకరాలకు సాగునీరు అందేది. అన్నమయ్య ప్రాజెక్టు సమీప గ్రామాలలో భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ఊరటగా ఉండేది.ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ఈ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయారు. 2024 మే వరకు అధికారంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఇంతటి ముఖ్యమైన ప్రాజెక్టు పునర్‌నిర్మాణం కోసం పైసా ఖర్చు చేసిన పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దృష్టికి ఈ ప్రాజెక్టు సమస్యను తీసుకెళ్లారు. దీంతో మహానాడు బహిరంగసభలో మాట్లాడిన చంద్రబాబు తమ హయాంలోనే అన్నమయ్య ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు.. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



ప్రాజెక్టు తెగిపోవడంతో నదిలో వృథాగా పోతున్న నీరు

అన్నమయ్య ప్రాజెక్టు పూర్తయితే...

సకాలంలో అన్నమయ్య ప్రాజెక్టును పూర్తి చేస్తే రాజంపేట నియోజకవర్గంలో పలు మండలాలకు ఎంతో మేలు కలుగుతుంది. రాజంపేటకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో రెండు కొండల మధ్యలో పింఛా, బాహుదా, తిరుమల నుంచి పుల్లంగేరు, మాండవ్య, గంగనేరు నదులు కలిసే చెయ్యేరునది పైన రాజంపేట మండలం బాదినగడ్డ వద్ద అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. ఇప్పుడు అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణం జరిగితేమూడున్నర సంవత్సరాలుగా పంటలు పండక ఇబ్బంది పడుతున్న అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టు గ్రామాల రైతులకు మేలు కలుగుతుంది. రాజంపేట మున్సిపాలిటీతో పాటు నందలూరు, పుల్లంపేట మండలాలకు తాగునీటి సౌకర్యం కలుగుతుంది.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం



రాయచోటి సర్కిల్‌లో నిలబడిపోయిన వాహనాలు



రాయచోటి సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్

కడప రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): కడప నగరం చెర్లోపల్లెలోని 150 ఎకరాల్లో నిర్వహిస్తున్న మూడవరోజు మహానాడు బహిరంగ సభకు రాయచోటి సర్కిల్ మీదుగా తిరుపతి, రాజంపేట, బద్వేలు, నెల్లూరు, ప్రకాశం, రాయచోటి, చిత్తూరు, మదనపల్లె, పలమనేరు, తంబళ్లపల్లె తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వాహనాలు తరలివావడంతో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నలువైపుల నుంచి ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ఒకవైపు మార్గంలోని వాహనాలను పంపించడానికి మరో వైపు వాహనాలను దాదాపు 20 నిమిషాల పాటు నిలుపుదల చేయడంతో వాహనాలు కిలోమీటరు దూరం మేర బారులు తీరాయి.



మహా ప్రభంజనం..

● లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు ● ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు ● పర్యవేక్షించిన ఐపీఎస్ అధికారులు

కడప క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం వద్ద గురువారం బహిరంగ సభ నిర్వహించడంతో రాష్ట్ర నలుమూలల నుంచి జనాలు లక్షలాదిగా తరలివచ్చారు. దీంతో వేలాది వాహనాలు రోడ్లపై బారులు తీరాయి. అప్పటికే సభావేదిక వద్ద ఉన్న గ్యాలరీలన్నీ నిండిపోవడంతో జనాలు రోడ్లపైనే ఉండిపోవాల్సి వచ్చింది. ఉదయం 6 నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో కార్యకర్తలు తరలిరావడంతో మొదటగా పోలీసులు వారిని బహిరంగ సభ మధ్యాహ్నం ఉంటుందని, అప్పటి వరకు బయట ఉండాలని చెప్పడంతో వారు ఎటూ వెళ్లకుండా అక్కడే కూర్చుండిపోయారు. దీంతో వచ్చిన వారు వచ్చినట్లుగా గ్యాలరీలన్నీ నిండిపోవడంతో వేదిక నుంచి అటు, ఇటువైపు మూడు కిలోమీటర్ల మేర టీడీపీ శ్రేణులు రోడ్లపైనే నిలిచిపోయారు. దీంతో ఎటు చూసినా జనాలే కనిపించారు. పార్కింగ్ ప్లేస్‌లు కూడా వాహనాలతో నిండిపోవడంతో చాలావరకు రోడ్లపైనే నిలిపారు. అయితే రాయచోటి నుంచి సభాప్రాంగణానికి వచ్చే కార్యకర్తల భారీ వాహనాలను సర్కిల్ వద్దనే నిలపడంతో కార్యకర్తలు 3 కి.మీ మేర నడుచుకుంటూ సభా ప్రాంగణానికి వెళ్లారు. ఇతర కార్లు, స్కూటర్లు, ఆటోలు ఉన్న వారిని జయరాజ్ గార్డెన్స్ వద్ద నిలిపివేశారు. అనుమతి ఉన్న కార్లను మాత్రమే లోపలికి పంపించడంతో అక్కడి నుంచి కూడా కార్యకర్తలు, నేతలు నడుచుకుంటూనే వెళ్లారు. ఇటు పులివెందుల రోడ్డు నుంచి సభా ప్రాంగణానికి మూడు కి.మీ మేర జనసంద్రమైంది.

పోలీసుల పనితీరు భేష్

ఉదయం 9 గంటల నుంచే రోడ్లపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. కార్యకర్తలున్న వాహనాలను సభా ప్రాంగణం చుట్టూ ఉన్న పార్కింగ్ ప్రాంతాలకు వన్ బై వన్ పంపించారు. పోలీసులు అడుగడుగునా విధులు నిర్వహిస్తూ ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. సభా ప్రాంగణం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

ఆక్టోపస్ సిబ్బందికి సూచనలు

చంద్రబాబు వ్యక్తిగత భద్రతా సిబ్బందికి ఐపీఎస్ అధికారి దీపికా ఎం.పాటిల్ పలు సూచనలు చేశారు. సభాప్రాంగణం వద్ద ఉన్న వారితో ఆమె మాట్లాడారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఉండాలి. ముఖ్యమంత్రి సభ నుంచి కిందకి దిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. జనాలు రాకుండా రోప్ సహాయంతో ఎలాంటి ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు ఏ విధంగా తీసుకోవాలని వారికి సూచనలు చేశారు.


రోడ్లపై బారులు తీరిన వాహనాలు


ఆక్టోపస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐపీఎస్ అధికారి దీపిక ఎం.పాటెల్


ట్రాఫిక్‌పై ఎస్ఐతో మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్

అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీతో భద్రత

● పర్యవేక్షించిన ఐజీపీ (ఆపరేషన్స్) సీహెచ్ శ్రీకాంత్

కడప క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడు నేపథ్యంలో గురువారం పబ్బాపురం వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ ద్వారా భద్రత కల్పించారు. ఐజీపీ (ఆపరేషన్స్) సీహెచ్ శ్రీకాంత్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూము నుంచి స్వయంగా పర్యవేక్షించారు. 23 డ్రోన్లు, నాలుగు అత్యాధునిక టెక్నాలజీ డ్రోన్లను వినియోగిస్తూ భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ సజావుగా సాగేలా పార్కింగ్, బహిరంగ సభ స్థలి వద్ద ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు విహంగ వీక్షణం ద్వారా పర్యవేక్షిస్తూ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.


డ్రోన్ కెమెరా చిత్రాలను పరిశీలిస్తున్న ఐజీపీ శ్రీకాంత్

మహానాడుకు భారీగా జన సమీకరణ

● 40 వేల మందికి ప్రయాణ సౌకర్యం ● 25 వేల మందికి భోజన ఏర్పాట్లు

● అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం పూర్వజన్మ సుకృతం : చమర్తి


కార్యకర్తలతో కలిసి బయలుదేరిన చమర్తి


చమర్తి జగన్‌మోహన్‌రాజును అభినందిస్తున్న లోకేశ్

రాజంపేట, మే 29(ఆంధ్రజ్యోతి): మహానాడు ముగింపు రోజు భారీ బహిరంగ సభ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 40 వేల మందికి వాహన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కార్లు, బస్సులు, మోటారుసైకిళ్లు, ఆటోలు తదితర వాహనాలను నియోజవర్గంలోని ఆరు మండలాల్లో వందలాది వాహనాలను ఏర్పాటు చేశారు. రాజంపేట నుంచి కడప వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల కార్యకర్తలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాల్లో వచ్చి టీడీపీ కార్యకర్తలకు సుమారు 25వేల మందికి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. భారీ వాహనాల సమూహాల మధ్య కార్యకర్తలతో కలిసి కడప మహానాడు బహిరంగ సభకు చమర్తి తరలివెళ్లారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ తన కోరిక మేరకు అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పునర్నిర్మించాలని ఇచ్చిన విజ్ఞాపన పత్రం మేరకు వెనువెంటనే అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహానాడు సభలో ప్రకటించడం పూర్వజన్మ సుకృతమని, తాను జన్మలో మరచిపోలేనని, ఈ ప్రాజెక్టు నిర్మిస్తే రాజంపేట సస్యశ్యామలవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాయకత్వంపై అచెంచల విశ్వాసంతో రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాదిగా జనాలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. దీంతో జగన్ సొంతగడ్డపై తెలుగుదేశం పార్టీ సత్తా ఏమిటో రుజువైందన్నారు. దీనిని బట్టి వచ్చే ఎన్నికల్లో టీడీపీ 10కి 10 స్థానాలు ఉమ్మడి కడప జిల్లాలో కైవసం చేసుకోవడం తథ్యమన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడు సందర్భంగా గత మూడురోజులుగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. చివరి రోజు బహిరంగసభ ప్రాంగణంలో నిర్వహించిన సత్యమాస్టర్ డ్యాన్స్ టీం ఆధ్వర్యంలో 25 మంది కళాకారులు నృత్యప్రదర్శన నిర్వహించారు. రేలారే రేలా జానకిరావు ఆధ్వర్యంలో జానపద నృత్య కళాకారులతో సందడి చేశారు. కొండపల్లి ఉదయకుమార్ టీం జానపద నృత్యం, రమణ టీం నృత్య ప్రదర్శన, ఎస్కే రాజు తెలంగాణ జానపదాలు, తెలంగాణ నృత్య ప్రదర్శనలు, అలాగే హరిబాబు, జోగి క్రిష్ణంరాజు నాటక ప్రదర్శన ఇచ్చారు.

మహానాడు బహిరంగ సభకు 875 బస్సులు

కడపకల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి కడప రీజియన్‌లోని ఆరు డిపోలతో పాటు మిగతా జిల్లా నలుమూలల నుంచి దాదాపు 875 బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ బస్సుల ద్వారా వివిధ ప్రాంతాల నుంచి మహా బహిరంగ సభకు పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తలు అభిమానులను తరలించారు. దీంతో రహదారులన్నీ పూర్తిగా జనంతో కిక్కిరిసిపోయాయి. బహిరంగసభ అనంతరం తిరిగి అంతే సురక్షితంగా కార్యకర్తలను బస్సుల ద్వారా గమ్యస్థానాలకు చేర్చారు.



మహానాడులో 'మేము సైతం'

కడపరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో మూడవ రోజు నిర్వహించిన ప్రజాబహిరంగ సభకు బాల బాలికలు మేము సైతం అంటూ వారి తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. జెండాలను చేతబట్టి ఉత్సాహంగా నడుచుకుంటూ తరలివచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు, టీడీపీకి జై అంటూ ముందుకు సాగారు. బహిరంగసభ ముగిసిన అనంతరం వారి ప్రాంతాలకు పయనమయ్యారు.



వైసీపీ ఎంపీపీపై అనర్హత వేటు

ముద్దనూరు మే 29 (ఆంధ్రజ్యోతి):ముద్దనూరు మండల వైసీపీ ఎంపీపీ కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డిపై అనర్హత వేటు వేస్తూ జడ్పీ సీఈవో ఓబులమ్మ ఆదేశాలు జారీ చేశారు. ప్రదీప్‌కుమార్‌రెడ్డి శెట్టివారిపల్లె ఎంపీటీసీగా గెలుపొందారు. మండలంలో వైసీపీ ఎంపీటీసీ సభ్యుల బలం ఉండటంతో కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నుకున్నారు. అయితే ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న మండల సర్వసభ్య సమావేశాలకు వరుసగా గైర్హాజరవుతుండటంతో గతంలో నుంచి ఇప్పటి వరకు ఉన్న ఎంపీడీవోలు జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఈవో ఓబులమ్మ శెట్టివారిపల్లె ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్‌రెడ్డిపై అనర్హత ప్రకటించి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి తెలిపారు.

1 నుంచి సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జూన్ 1వ తేదీ నుంచి ఏసీఏ సౌత్ జోన్ అండర్ 23 మెన్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఇందులో కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడనున్నాయి. ఇందులో భాగంగా 1వ తేదీ రిమ్స్ వద్ద గల వైఎస్ఆర్ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య అలాగే కేఎస్ఆర్ఎం స్టేడియంలో అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య, తిరిగి 2న కర్నూలు - నెల్లూరు, అదేరోజు కడప - చిత్తూరు మధ్య మ్యాచ్ లు జరగనున్నాయి. 3న ఆటకు విశ్రాంతి దినం. 4న అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య, కడప-నెల్లూరు, 5న చిత్తూరు-నెల్లూరు, అనంత పురం-కర్నూలు జట్ల మధ్య జరగనుంది. 6న విశ్రాంతి దినం, 7న అనంతపురం-కడప, చిత్తూరు -కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నట్లు వెల్లడించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

నందలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 31న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని.. అందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలను చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టూరిజం అధికారి నాగభూషణం, ఎంపీడీవో రాధాకృష్ణంరాజు, ఈవోఆర్డీ సునీల్‌కుమార్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, ఎంఈవోలు అనంతకృష్ణ, నాగయ్య, ఏవో మల్లికార్జున, ఏపీఓ మురళి, ఏపీఎం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

- 328 మందికి సీట్లు ఖరారు



సీటు సాధించిన విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

పీలేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌జేసీ గురుకులాల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 328 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు రాయలసీమ రీజియన్ కన్వీనర్ డా.ఎం.చెన్నకేశవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ రీజియన్ పరిధిలోని గ్యారంపల్లె, కొడిగెనహళ్లి, కర్నూలులోని ఉర్దూ మైనారిటీ బాలుర కళాశాలల్లో అడ్మిషన్ల కోసం సోమవారం ఎంపీసీ గ్రూపునకు 123 మంది, మంగళవారం బైపీసీ గ్రూపులో 119 మంది, బుధవారం ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 86 మంది విద్యార్థులు సీట్లు సాధించారని ఆయన వివరించారు. సీట్లు సాధించిన విద్యార్థులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్యారంపల్లె ప్రిన్సిపాల్ బ్రహ్మాజీ, కొడిగినహళ్లి ప్రిన్సిపాల్ జలజ, కర్నూలు మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ ముబషిర బేగం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అమృతేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు



పుష్పాలంకరణలో మరకత లింగం

ప్రొద్దుటూరు టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. మరకత లింగానికి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు, నవరత్న లింగానికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతిపూజ, రక్షాబంధనం, ధ్వజారోహణ, కలశస్థాపన, అంకురార్పణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ కొవ్వూరు రమేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మనోహర్, కార్యదర్శి శ్రీనివాసులు, టంగుటూరు వినోద్, భక్తులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న పీఠాధిపతులు



చక్రాయపేట,మే 29 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని గురువారం గన్నవరం, విజయవాడ భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానందభారతి, బ్రహ్మంగారిమఠం ఆశ్రమం జ్ఞానేంద్రస్వామిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు కేసరి, సిబ్బంది వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చరిత్ర, మహిమలు అడిగి తెలుసుకున్నారు.

జెండాలు, ఫ్లెక్సీల ధ్వంసం కేసులో 13 మంది అరెస్టు



పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పులివెందుల, మే 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండాలను, ఫ్లెక్సీలను, తోరణాలను ధ్వంసం చేసిన కేసులో 13 మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ తెలి పారు. బుధవారం పార్నపల్లె, నల్లపురెడ్డిపల్లె సర్కిళ్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడు సందర్భంగా జెండాలు, ఫ్లెక్సీలు, తోరణాలను ఏర్పాటు చేశారు. వైఎస్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేశారనే నెపంతో వైసీపీకి చెందిన పలువురు వీటిని ధ్వంసం చేశారు. జెండాలు పీకేసి, తోరణాలు తొలగించి, ఫ్లెక్సీలను కూలదోశారు. దీనిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 15 మందిపై కేసు నమోదు చేసి 12 మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం వీరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్‌చైర్మన్ హాఫీజుల్లా, కోఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, పార్నపల్లె కిషోర్, కావేటి మల్లికార్జున, రాజా, తరుణ్, ఎ.ఖాదర్ బాష, ఓ.రసూల్, మస్తాన్, సాతుపాటి వెంకటచలపతి తదితరులను అరెస్టు చేసి.. వైద్యపరీక్షల అనంతరం గురువారం రాత్రి కోర్టులో హాజరుపరిచామన్నారు.

మేయర్ సురేశ్‌బాబు తొలగింపుపై హైకోర్టు స్టే

- వైసీపీ కార్పొరేటర్లు, నాయకుల సంబరాలు



మేయర్ సురేష్‌బాబుకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబు కుటుంబ సభ్యులు కాంట్రాక్ట్ పనులు చేశారు. అది మున్సిపల్ చట్ట వ్యతిరేకమని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మున్సిపల్‌శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మేయర్‌కు వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసు జారీ చేశారు. దీనిపై మేయర్ సురేష్‌బాబు మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి తన వివరణను సమర్పించారు. అయితే ఆ ఎక్స్‌ప్లనేషన్ సరిగా లేకపోవడంతో సురేశ్‌బాబును తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్వర్వులను సవాల్ చేస్తూ మేయర్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం హైకోర్టు డివిజనల్ బెంచ్ విచారణ జరిపి న్యాయస్థానం స్టే విధించినట్లు సమాచారం.

వైసీపీ సంబరాలు : మేయర్ సురేశ్‌బాబు తొలగింపుపై హైకోర్టు డివిజనల్ బెంచ్ స్టే మంజూరు చేసినట్లు సమాచారం రావడంతో వైసీపీ కార్పొరేటర్లు నాయకులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. గురువారం కడప నగరం చిన్నచౌక్ మేయర్ కార్యాల యంలో కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందన్నారు. ఎమ్మెల్యే మాధవి చేసిన కుయుక్తులు ఏవీ ఫలించలేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్‌తో పాటు కార్పొ రేటర్లు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి

- అధికారికంగా ఉత్తర్వులు జారీ

కడప రూరల్, మే 29 : కడప జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా అట్లూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన మంచూరు సూర్యనారాయణరెడ్డిని నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్వర్వులను జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆయన పేరును ఏప్రిల్ 28న ప్రకటించిన నేపథ్యంలో బుధవారం అధికారికంగా తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక డీసీసీబీ డైరక్టర్లను కూడా ప్రభుత్వం వీలైనంత త్వరలో ప్రకటించనున్నట్లు వినికిడి. డైరక్టర్ల ప్రకటన వెలువడగానే డీసీసీబీ చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. అప్పటి వరకు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ కొనసాగనున్నారు.

కడప జిల్లా ఇంటర్మీడియట్ అధికారిగా సుబ్రమణ్యం

కలికిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో)గా జేవీఎస్ఎస్ సుబ్రమణ్యంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లా దవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యంకు పదోన్నతి కల్పిస్తూ ఖాళీగా వున్న స్థానంలో కడప డీఐఈవోగా నియమించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

గ్రేడ్ 2 మున్సిపాలిటీగా ఎర్రగుంట్ల నగరపంచాయతీ

ఎర్రగుంట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగర పంచాయతీని గ్రేడ్-2 మున్సిపాలిటీగా మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2012 మార్చిలో జిల్లాలో మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఎర్రగుంట్లను నగర పంచాయతీగా మార్చారు. ప్రస్తుతం గ్రేడ్-2 మున్సిపాలిటీగా మారుస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు గురువారం (మే 29న) గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైనట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ చెముళ్లపల్లెకు చెందిన సతీష్‌కుమార్

చెన్నూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కొత్త రోడ్డు వద్ద గురు వారం రాత్రి మద్యం తాగిన ఇద్దరు యువకులు గొడవ పడ్డారు. ఒకరిపై మరొకరు కత్తితో దాడి చేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. ఖాజీపేట మండలం చెము ళ్లపల్లెకు చెందిన ములపాకు సతీష్‌కుమార్ (23), చెన్నూరు లక్ష్మిన గర్‌కు చెందిన సుబ్బరాయుడు బుధవారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి తిట్టుకుంటూ ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో సుబ్బరాయుడు కత్తితో సతీష్‌కుమార్‌పై దాడి చేసి పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు సతీష్‌ను చికిత్స నిమిత్తం కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే స్థానికులు మాత్రం ఇరువురి మధ్య గతంలో పాత గొడవలు ఉండటంతోనే దాడి చేసుకున్నారని చెబుతున్నారు.

యుద్ధనీతి, పాలన దక్షతలో దిట్ట అహల్యభాయి

- కేంద్ర సహాయ మంత్రి మురుగన్



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి మురుగన్

రాయచోటిటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): యుద్ధనీతి పరిపాలన దక్షత కలిగిన మహనీయురాలు పుణ్యశ్లోక అహల్యభాయి హోల్కర్ అని కేంద్ర సమాచార ప్రసారశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి మురుగన్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న అహల్యభాయి త్రిశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల సాయిశుభా కల్యాణ మండపం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అధ్యక్షతన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ పుణ్యశ్లోక రాణి అహల్యభాయ్ హోల్కర్ చిన్నతనం నుంచి చూపించిన ధీరోధాత్త యుద్ధ నైపుణ్యత కాశీ నుంచి కన్యాకుమారి వరకు దేవాలయాల పునర్నిర్మాణం కోసం ఆమె చేసిన కృషి అమోఘం అన్నారు. అలాగే దేశ ఆర్థిక ఉన్నతి కోసం పలుచోట్ల గాట్ల నిర్మాణం చేపట్టి ఎగుమతులను, దిగుమతులను ప్రోత్సహించారన్నారు. అప్పటి కాలంలో ఆమె చేపట్టిన పలు కార్యక్రమాలకు ప్రస్తుతం మోడీ చేపడుతున్న అనేక కార్యక్రమాలకు దగ్గర సారూప్యత ఉందని విపులంగా వివరించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ మాట్లాడుతూ మహిళల స్వావలంబన కోసం ఆమె ఎంతో కృషి చేశారన్నారు. చేనేత కార్మికుల కోసం వాళ్లు నేసిన చీరలు ఆమె స్వయంగా ధరించి ప్రచారం చేయడం అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. కార్యక్రమంలో శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగో తు రమేశ్ నాయుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, జిల్లా అధ్యక్షురాలు సునీతనారాయణవర్మ, బాలజ్యోతి, నిర్మల్‌కుమార్, రేపన శివప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్‌కుమార్‌రాజు, కృష్ణయాదవ్, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా మాతంగ మహా పీఠం శిలాశాసన ప్రతిష్ఠ



పీఠంలో 108 అగ్ని హోమాలు ఏర్పాటు చేసిన దృశ్యం



పీఠం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

లక్కిరెడ్డిపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కిరెడ్డిపల్లె లోని దొర్రిచెరువు సమీపాన మాతంగ మహా పీఠం శిలా శాసన ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి మురగన్, కర్ణాటక పౌరసరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి రాజనర్సింహ, కర్ణాటక శ్రీహరిపురం పీఠాధిపతులు శిలాఫలకాన్ని ప్రారంభించారు. ముందుగా శ్రీమాతాంగ పీఠం మాతాంగ నందగిరిస్వామిజీ (నూకల రవీంద్ర) సారథ్యంలో 108 హోమ గుండాలతో జంట దంపతులతో యాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నాలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. కాగా, దొర్రిచెరువు సమీపంలో 10 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న మహా పీఠానికి దాదాపు రూ.69 కోట్లు వెచ్చిస్తున్నట్లు పీఠం పీఠాధిపతి మాతాంగ నందగిరిస్వామి తెలియజేశారు. కార్యక్రమానికి పీఠం కమిటీ సభ్యులు శివగంగిరెడ్డి, డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డితో పాటు దాతలు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక శ్రీహరిపురం పీఠాధిపతి ఆదిశంకరచార్య శారద లక్ష్మినరసింహస్వామి, పీఠం అధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి కమలానంద భారతి స్వామిజీ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె ప్రాంతంలో మాతాంగ పీఠం ఏర్పాటుతో ధార్మిక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. మాతంగి పీఠం అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర మంత్రి మురగన్, కర్ణాటక పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ పీఠంలో గోశాల, అన్నశాల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ జిల్లా నాయకులు వీహెచ్‌పీ ఎనమల విశ్వనాథ్, వెంక్రమణ (గురుస్వామి), బీజేపీ రామచంద్రారెడ్డి, కృష్ణ, సుబ్బయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఉషారాణి, సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడప సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్‌పై విచారణ

కలికిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెం డెంట్‌గా పనిచేస్తున్న ఎస్. కమలాకర్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విశాఖపట్నం కేంద్ర కారాగారంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కమలాకర్‌ను కడప కారాగారానికి గతంలో అటాచ్ చేశారు. ఈయన విశాఖ పట్నం జైలు బాధ్యతలు నిర్వహిస్తున్న కాలంలో ఉప్పాడ గౌరీశంకర్ అనే శిక్ష పడిన ఖైదీ 2024 జూలై 30న జైలులో ఉరేసుకుని మరణించాడు. దీనికి ప్రధాన కారణం శిక్ష పడి కొత్తగా జైలుకొచ్చిన ఖైదీని జైలు నిబంధనల ప్రకా రం కొద్ది కాలంపాటు జైలులో పలు జాగ్రత్తలతో ప్రత్యేక బ్యారెక్‌లో వుంచి అప్రమత్తంగా పరిశీలించాల్సి వుంది. అలాకాకుండా మృతుడు ఖైదీ గౌరీశంక ర్‌ను జైలుకు వచ్చిన మరుసటి రోజే ఇతర ఖైదీలున్న సాధారణ బ్యారెక్‌కు తరలించారు. ఖైదీ ఉరేసుకుని చనిపోవడానికి ఇదే ప్రధాన కారణంగా నిర్ధారించారు. ఇందులో డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్ తీవ్ర నిర్లక్ష్యం, దుష్ప్రవర్తనలు ప్రధానంగా కారణమయ్యాయని కూడా నిర్ధారించారు. ఈ సంఘటనలో కమలాకర్‌తో సహా మొత్తం ఆరుగురు సహచరులను కూడా బాధ్యులుగా తేల్చారు. దీనిపైన గత జనవరి 29న ప్రభుత్వం కమలాకర్ నుంచి వివరణ కోరింది. అయితే కమలాకర్ సంజాయిషీలు సహేతుకంగా లేవని భావించిన ప్రభుత్వం అతనితో సహా మొత్తం ఆరుగురిపై విచారణ జరిపించాలని నిర్ణయించింది. తాజాగా గుంటూరు రేంజి జైళ్ళ శాఖ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్‌ను విచారణాధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల లోగా విచారణ నివేదికను సమర్పించాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

కడప రిటైర్డు సైక్రియాట్రీ ప్రొఫెసర్‌పై..

కలికిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్‌లో సైక్రియాట్రీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన డాక్టర్ రాధాకృష్ణ రాజుపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. నోటీసులతోపాటు విచారణకు దారితీసిన అంశాలను కూడా ఆయనకు పంపించారు. ప్రభుత్వం నమోదు చేసిన అభియోగాల ప్రకారం.. డాక్టర్ రాధాకృష్ణ రాజు తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రొఫెసర్‌గా పనిచేస్తూ 2023 అక్టోబరు 14 నుంచి 2024 ఏప్రిల్ 17 వరకూ విధులకు గైర్హాజరయ్యారు. దీనికి సంబంధించి ఎలాంటి ముందస్తు సెలవు కూడా తీసుకోలేదు. ఆయన నిర్లక్ష్యం కారణంగా ఆ వైద్య విభాగంలో బోధనా పరంగా, చికిత్సల పరంగా తీవ్ర ఇబ్బందులెదురయ్యాయి. ఈ నేపథ్యంలో 2024 ఏప్రిల్ 18న ఆయన నేరుగా వైద్య విద్య డైరెక్టరు ముందు హాజరయ్యారు. దీనిపై తీసుకోవాల్సిన క్రమశిక్షణా చర్యలను పెండింగ్‌లో పెడుతూ అదే నెల 18వ తేదీ కడప మెడికల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లో నియమించారు. దీనిపై ప్రస్తుతం విచారణ చేయించాలని సంకల్పించారు. ఈ మేరకు ప్రాథమికంగా ఆయనకు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి గురువారం ఆదేశాలిచ్చారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పెంపు

కడప/రాయచోటి కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడేషన్ల గడువు మూడు నెలలు పెంచుతూ సమాచార పౌర సంబంధాలశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, కడప డీఐపీఆర్వో వేణుగోపాలరెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న జర్నలిస్టులకు మాత్రమే మరో 3నెలల పాటు (జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు) ఈ పొడిగింపు వర్తిస్తుందన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యం వారి సంస్థలో పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలను ఆయా జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో అందజేయాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

మహానాడును చూసి వైసీపీలో వణుకు



స్కూటర్‌కు సైకిల్ తగిలించుకొని ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ కార్యకర్త



రైల్వేకోడూరు: మహానాడుకు తరలుతున్న ముక్కా దంపతులు... గువ్వలచెరువు వద్ద భోజనం చేస్తున్న మంత్రి మండిపల్లి... భోజనం వడ్డిస్తున్న చమర్తి



సుండుపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప



ఒంటిమిట్ట: మహానాడుకు వెళుతున్న నాయకులు



ఓబులవారిపల్లె : మహానాడుకు బయలుదేరిన టీడీపీ బొమ్మవరం పంచాయతీ నాయకులు



రాజంపేట: భోజన ప్యాకెట్లు అందజేస్తున్న కావుటూరు సుబ్రమణ్యంనాయుడు

రైల్వేకోడూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మహానాడు ఘన విజయం చూసి వైసీపీలో వణుకు మొదలైందని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మహానాడు బహిరంగ సమావేశానికి రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఇందులో భాగంగా నందలూరు మండలంలోని ఆల్విన్ ఫ్యాక్టరీ వద్ద పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు అల్పార విందు ఏర్పాటు చేశారు. ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు, రైల్వేకోడూరు మండలాల నుంచి భారీ సంఖ్యలో వాహనాల్లో తరలివెళ్లారు. టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి, యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మండిపల్లి ఆధ్వర్యంలో...

రామాపురం:మహానాడుకు వెళ్లేవారి కోసం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మం డిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం గువ్వలచెరువు వద్ద భో జనం ఏర్పాటు చేశారు. భోజన వసతి అభినందనీ య మని తంబళ్లపల్లి తెలుగుదేశం ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, పుంగనూరు ఇన్‌చార్జి చల్లా బాబు, డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డితో కలిసి భోజనం చేశారు.

సుండుపల్లె: సుండుపల్లె మండలం నుంచి సుమారు 5 వేల మంది పార్టీ శ్రేణులు తరలివెళ్లినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డెప్ప గురువారం తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల నుంచి 70 బస్సుల్లో, 200 కార్లలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మహానాడుకు తరలివెళ్లారు.

గాలివీడు: మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుంచి మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. దాదాపుగా 500 వాహనాల్లో 6 వేల మందికిపైగా తరలివెళ్లినట్లు సమాచారం. నూలివీడు పంచాయతీ నుంచి మాజీ ఎంపీటీసీ పొట్లి పార్వతమ్మ ఆధ్వర్యంలో 20 వాహనాల్లో జనం తరలివెళ్లారు.

పెనగలూరు: కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడి వర్గీయులు వేర్వేరుగా వాహనాల్లో మహానాడుకు వెళ్లారు. మండల కేంద్రం నుంచి బీఎల్ నరసింహారెడ్డి జి.రంగారెడ్డి, కె.బాలక్రిష్ణ, ఎం.రాంప్రసాద్‌నాయుడు, సిద్దవరం నుంచి జి.రెడ్డయ్య, సింగారెడ్డిపల్లె ఎం.శివయ్య, లక్ష్మీనరసయ్య, ఓబిలి నుంచి అమీరుల్లా, నారాయణనెల్లూరు నుంచి మల్లయ్య, కళాచంద్ర, నల్లపురెడ్డిపల్లె ఎల్.శ్రీనివాసులరెడ్డి, ఈటమాపురం నుంచి రవికుమార్, పి.సుబ్రమణ్యం, పేరంవారిపల్లె నుంచి దాసరి దామోదర్ నాయుడు, సుదర్శన్ తమ బృందాలతో తరలి వెళ్లారు.

నందలూరు : మహానాడు కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, టీడీపీ నాయకులు కానకుర్తి వెంకటయ్య, బెస్తబాబు, ధనంయ్యనాయుడు, పల్లె నాగయ్య, మౌలా, మెహర్, తుమ్మది శివ తదితర నాయకులు మహానాడుకు వెళ్లారు.

ఒంటిమిట్ట: టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, సీనియర్ నాయకులు ఎస్వీ రమణ, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు మహానాడుకు తరలివెళ్లారు. సుమారు 60 బస్సులు, 35 ఆటోలు, 20 కార్లు, 300 స్కూటర్లలో తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. మండలం నుంచి సుమారు 5500 మంది నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. వీరికి ఉప్పరపల్లె గ్రామంలో భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు ఎస్వీ రమణ మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో బహిరంగ సభకు తరలి వెళుతున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, ఎంపీపీ ప్రతినిధి నల్లగొండ వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర మహిళా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బమ్మ ఆధ్వర్యంలో మహానాడు బహిరంగసభకు కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు.

కావుటూరు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు

రాజంపేట: టీడీపీ సీనియర్ నాయకులు, రియల్‌ఎస్టేటర్ కావుటూరు సుబ్రమణ్యంనాయుడు (మణి), ఆయన సోదరుడు కావుటూరు ఆదినారాయణనాయుడు ఆధ్వర్యంలో మహానాడు సందర్భంగా టీడీపీ కార్యకర్తలకు పెద్దఎత్తున భోజన ఏర్పాట్లు చేశారు. మహానాడుకు వాహనాల్లో వెళుతున్న కార్యకర్తలకు భోజన ప్యాకెట్లను వాహనాల వద్దకు వెళ్లి అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, కూచివారిపల్లె యువ నాయకులు మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : మహానాడు సభకు రాష్ట్ర యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సారథ్యంలో మండల టీడీపీ యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో భారీగా జనం తరలివెళ్లారు. దాదాపు 100పైగా సైకిల్‌పై ర్యాలీగా వెళుతున్నామని ఆయన తెలియజేశారు.

మహానాడుకు వెళ్లే వారికి ఉప్పరపల్లెలో భోజనం

సిద్దవటం: మహానాడుకు వెళ్లే వారికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో గురువారం ఉప్పరపల్లెలో భోజన వసతి ఏర్పాటు చేశారు. టీడీపీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, రాష్ట్ర బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులనాయుడు, టీడీపీ సీనియర్ నేత పుత్తా బాబు, మాజీ జడ్పీటీసీ సభ్యులు చలమయ్యయాదవ్, మాజీ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



గాలివీడు: మహానాడుకు వెళుతున్న టీడీపీ శ్రేణులు



పెనగలూరు: మహానాడుకు తరలివెళుతున్న బీఎల్ నరసింహారెడ్డి బృందం



మహానాడుకు తరలిన నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ టీడీపీ నాయకులు

అగ్ని ప్రమాదంలో నిమ్మచెట్లు దగ్ధం

పెనగలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతంపల్లె పంచాయతీ వీఎన్‌పల్లెలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో వేపాటివారిపల్లె పెంచలయ్యకు చెందిన నిమ్మతోట దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిమ్మతోట కంచెకు నిప్పు పెట్టడంతో కంచెతో పాటు నిమ్మతోటకు మంటలు అంటుకున్నాయి. రాజంపేట అగ్నిమాపక అధికారి బి.శివయ్య తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో రూ.80 వేలు నష్టం వాటిల్లి ఉంటుందని రైతు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది బీసీఆర్ సుబ్రమణ్యం, నాగూర్ బాషా, రాజేశ్వర్ నిమ్మతోటలో చెలరేగిన మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలిపారు.

కోదండరాముని సన్నిధిలో మంత్రి సంధ్యారాణి



కోదండరామాలయంలో మంత్రి సంధ్యా రాణి

ఒంటిమిట్ట, మే 29 (ఆంధ్రజ్యోతి):స్థానిక కోదండరామాలయాన్ని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మం త్రి సంధ్యారాణి సందర్శించారు. ఆల య అర్చకులు వీణారాఘవాచార్యులు పవన్‌కుమార్ ఆమెకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఆలయంలో శిల్ప సంపద అద్భుతంగా ఉందని ఆమె కొనియాడారు. తహసీల్దారు రమణమ్మ, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో అం జి, ఐసీడీఎస్ అధికారులు, ఆలయ సి బ్బంది తదితరులు పాల్గొన్నారు. అలా గే గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో పాటు పలువురు ఎమ్మెల్యేలు కోదండరాముని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మనోహర్‌బాబు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు రెంటాల లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను పరిశీలించిన అధికారులు

చిట్వేలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చిట్వేలిలో వెలసిన వరదరాజస్వామి, వీరభద్రస్వామి ఆలయాలను గురువారం దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, రాజంపేట సమూహ దేవాలయాల అధికారి కొండారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ లక్షుమయ్య పరిశీలించారు. వరదరాజస్వామి ఆలయానికి సంబంధించిన సర్వేనంబరు 383లో 83 సెంట్ల ఖాళీ స్థలాన్ని అలాగే వీరభద్రస్వామి వారి ఆలయంలోని సర్వేనంబరు 165లో 2.28 ఎకరాల భూమిలో ఉన్న 60 మామిడి చెట్లను పరిశీలించారు. మామిడిచెట్లను గుత్తకు ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్వేయర్‌ను కలిసి భూములకు సంబంధించిన హద్దులను గుర్తించామని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి అర్చకులు అరవిందస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'మహానాడులో రైల్వేలైన్ ప్రస్తావన లేకపోవడం బాధాకరం'

రాయచోటిటౌన్, మే29(ఆంధ్రజ్యోతి): మహానాడు కార్యక్రమంలో కడప-బెంగుళూరు రైల్వేలైన్‌పై ప్రస్తావించకపోవడం బాధాదకరమని సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కడప-బెంగుళూరు రైల్వేలైన్ రావడం ద్వారా పట్టణ ప్రాంతాలకు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుందని, తద్వారా రైతాంగానికి, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందనే విషయాన్ని దృష్టి పెట్టుకొని రైల్వేలైన్ ఏర్పాటుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

వైభవంగా గంగమ్మతల్లి జాతర



కొత్తకోడూరులో గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

రైల్వేకోడూరు, మే 29(ఆంధ్రజ్యోతి): కొత్తకోడూరులో గురవారం గంగమ్మతల్లి జాతర వైభవంగా నిర్వహించారు.బుధవారం అర్ధరాత్రి గంగమ్మతల్లి ప్రతిమను పూలపల్లకీలో ఊరేగించారు. విజయవాడ నుంచి తప్పెట్లు తెప్పించారు.జాతర పెద్ద చెన్నంశెట్టి కుమార్ ఇటీవలే మృతి చెందడంతో దాని కొరత ప్రజల్లో ఏర్పడిందని ప్రస్తుత జాతర నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు.

బెరైటీస్ పల్వరైజింగ్ మిల్లులను ఆదుకోవాలి

రైల్వేకోడూరు, మే 29(ఆంధ్రజ్యోతి): బెరైటీస్ పల్వరైజింగ్ మిల్లులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నేత సీహెచ్ చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేటలో 175 పల్వరైజింగ్ మిల్లులు ఉన్నాయని, ఈ మిల్లుల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారిని కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మిల్లులకు రాయి లేక యజమానులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒక ఎక్స్‌పోర్టు కంపెనీకి సుమారు రూ.1680 ధర ఉన్న ముగ్గురాయిని రూ.1180లకు ధర తగ్గించి 60 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారని తెలిపారు. ఇదే రాయిని ముగ్గురాయి మిల్లులకు ఇచ్చి ఉంటే ఇటు కార్మికులు, అటు మిల్లుల యజమానులకు ఉపయోగపడేదన్నారు. ఎక్స్‌పోర్టర్స్‌కు ఒక ధర, మిల్లులకు మరో ధర, పారిశ్రామికవేత్తలకు ఇంకో ధరతో ముగ్గురాయి ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బెరైటీస్ పల్వరైజింగ్ మిల్లులు, కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం తప్పదని హెచ్చరించారు.

సౌమ్యనాథస్వామి సన్నిధిలో కన్నా లక్ష్మీనారాయణ



నందలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధి గాంచిన నందలూరు సౌమ్యనాథ స్వామిని మాజీ మంత్రి, టీడీపీ సత్తెనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం దర్శించుకున్నారు. తోట కేదరినాథ్‌బాబు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామికి ఆయన పూజలు చేశారు. అనంతరం ఆయనను సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఛైర్మన్ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ యెద్దల విజయసాగర్ పాల్గొన్నారు.

తేనెటీగల దాడి



తేనెటీగల దాడిలో గాయపడ్డ అమీర్‌బాషా

సిద్దవటం, మే 29 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం గురుకులం కళాశాల సమీపంలో గురువారం కొంతమందిపై తేనెటీగలు దాడి చేయడంతో వారు ఆస్పత్రికి పరుగులు తీశారు. వెంకటబాలాజి, మల్లికార్జున, అమీర్‌బాషా అనే వారిపై తేనెటీగలు దాడి చేయడంతో వారికి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది చికిత్సలు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

నందలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి అధిక సంఖ్యలో వెళుతున్న వాహనాల వల్ల స్థానిక బస్టాండు కూడలిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఉదయం 11 గంటల నుంచి దాదాపు మధ్యాహ్నం 2 గంటల వరకు పలుమార్లు వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడి



నూనె గింజల పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మహేశ్వర్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే29(ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంట సాగులో సస్యరక్షణ చర్యలు చే పట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని భారత నూనె గింజల పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మంగేశ్‌దుబే అన్నారు. గురువారం రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలో ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్తంగా వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడు తూ నూనె గింజల పంటలైన వేరుశనగ, ను వ్వులు, ఆముదం వంటి పంటల సాగులో మె లకువల గురించి వివరించారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు మా ట్లాడుతూ ఉద్యానవన పంటల సాగులో మేలైన సాగు యాజమాన్యాలు, కొత్త రకం పంటలపై అవగాహన కల్పించారు. నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి దివాకర్‌బాబు మాట్లాడుతూ వ్యవసాయరంగంలోని పథకాల గురించి తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సాయిమహేశ్వరి మాట్లాడుతూ వేరుశనగ, కంది, నువ్వులు వంటి వ్యవసాయ పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి సాధించే విధానాన్ని వివరించారు. అనంతరం పశువిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పశువుల పెంపకంలో మెలకువల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయం పద్ధతులపై వాటికి సంబంధించిన ప్రచురణలతో వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తండ్రి నాగేశ్వరరావు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణంరాజు, ఉద్యానవనశాఖ అధికారిణి నాగమణి, గ్రామీణ వ్యవసాయ అధికారిణి జ్యోతి, ఆత్మ ఏఊటీయం రాధిక, 70 మందికిపైగా రైతులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు ప్రణాళిక తయారు చేసుకోవాలి

రైల్వేకోడూరు, మే 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ముందస్తు ప్రణాళికను తయారు చేసుకోవాలని కోడూరు వ్యవసాయశాఖ అధికారి జి.సుధాకర్ తెలిపారు. గురువారం మండలంలోని గంగురాజుపోడు గ్రామంలో కేవీకే కలికిరి వ్యవసాయ శాఖ సహకారంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వీహెచ్‌ఏ నాగేంద్ర, సర్పంచులు కస్తూరి రామక్రిష్ణ, సుబ్రహ్మణ్యంరాజు, గంగురాజుపోడు, సూరపురాజుపల్లె రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు

రాయచోటిటౌన్, మే29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సర్వేపల్లి నరసింహ, రమణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లాలో పదవ తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనంలో భాగంగా బాపట్ల జిల్లా ప్రశ్నాపత్రాలు అన్నమయ్య జిల్లాలో మూల్యాంకనం చేసిన సందర్భంలో తేజస్విని అనే విద్యార్థినికి సాం ఘిక శాస్త్రంలో 23 మార్కులు వేసి ఫైల్ చేశారని, రీవాల్యూయేషన్‌లో 96 మార్కులు వచ్చాయన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ అధికారులు ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారన్నారు.

డివిజన్ స్థాయిలో యోగా శిక్షణ

రాయచోటిటౌన్, మే29(ఆంధ్రజ్యోతి): జూన్ 21వ తేదీ జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయచోటి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో రాయచోటి డివిజన్ స్థాయి ఒక్కరోజు యోగా శిక్షణ కార్యక్రం జరిగింది. ప్రతి మండలం నుంచి ఒక మహిళ, ఒక పురుష శిక్షకులకు డివిజన్ స్థాయి శిక్షకులు రమేశ్‌బాబు, వాణిశ్రీ యోగా శిక్షణను ఇచ్చారు. రాయచోటి, చిన్నమండెం, గాలివీడు, గుర్రకొండ, కలకడ, కేవీపల్లి, లక్కిరెడ్డిపల్లె, పీలేరు, రామాపురం, సంబేపల్లె మండలాల శిక్షకులు, రాజంపేట డివిజన్‌లోని సుండుపల్లె, వీరబల్లి మండలాల శిక్షకులు పాల్గొన్నారు. కాగా ఇక్కడ శిక్షణను పొందిన వారు జూన్ 4, 5వ తేదీల్లో వారి వారి మండలాల్లో పాఠశాల విద్యార్థులకు ఇక్షణ ఇస్తారని యోగా శిక్షకులు రమేశ్, వాణిశ్రీ తెలిపారు.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు







మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం





రాయచోటి సర్కిల్‌లో నిలబడిపోయిన వాహనాలు



రాయచోటి సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్

కడప రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): కడప నగరం చెర్లోపల్లెలోని 150 ఎకరాల్లో నిర్వహిస్తున్న మూడవరోజు మహానాడు బహిరంగ సభకు రాయచోటి సర్కిల్ మీదుగా తిరుపతి, రాజంపేట, బద్వేలు, నెల్లూరు, ప్రకాశం, రాయచోటి, చిత్తూరు, మదనపల్లె, పలమనేరు, తంబళ్లపల్లె తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వాహనాలు తరలివావడంతో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో నలువైపుల నుంచి ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ఒకవైపు మార్గంలోని వాహనాలను పంపించడానికి మరో వైపు వాహనాలను దాదాపు 20 నిమిషాల పాటు నిలుపుదల చేయడంతో వాహనాలు కిలోమీటరు దూరం మేర బారులు తీరాయి.



మహా ప్రభంజనం..

● లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు ● ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు ● పర్యవేక్షించిన ఐపీఎస్ అధికారులు

కడప క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం వద్ద గురువారం బహిరంగ సభ నిర్వహించడంతో రాష్ట్ర నలుమూలల నుంచి జనాలు లక్షలాదిగా తరలివచ్చారు. దీంతో వేలాది వాహనాలు రోడ్లపై బారులు తీరాయి. అప్పటికే సభావేదిక వద్ద ఉన్న గ్యాలరీలన్నీ నిండిపోవడంతో జనాలు రోడ్లపైనే ఉండిపోవాల్సి వచ్చింది. ఉదయం 6 నుంచే వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో కార్యకర్తలు తరలిరావడంతో మొదటగా పోలీసులు వారిని బహిరంగ సభ మధ్యాహ్నం ఉంటుందని, అప్పటి వరకు బయట ఉండాలని చెప్పడంతో వారు ఎటూ వెళ్లకుండా అక్కడే కూర్చుండిపోయారు. దీంతో వచ్చిన వారు వచ్చినట్లుగా గ్యాలరీలన్నీ నిండిపోవడంతో వేదిక నుంచి అటు, ఇటువైపు మూడు కిలోమీటర్ల మేర టీడీపీ శ్రేణులు రోడ్లపైనే నిలిచిపోయారు. దీంతో ఎటు చూసినా జనాలే కనిపించారు. పార్కింగ్ ప్లేస్‌లు కూడా వాహనాలతో నిండిపోవడంతో చాలావరకు రోడ్లపైనే నిలిపారు. అయితే రాయచోటి నుంచి సభాప్రాంగణానికి వచ్చే కార్యకర్తల భారీ వాహనాలను సర్కిల్ వద్దనే నిలపడంతో కార్యకర్తలు 3 కి.మీ మేర నడుచుకుంటూ సభా ప్రాంగణానికి వెళ్లారు. ఇతర కార్లు, స్కూటర్లు, ఆటోలు ఉన్న వారిని జయరాజ్ గార్డెన్స్ వద్ద నిలిపివేశారు. అనుమతి ఉన్న కార్లను మాత్రమే లోపలికి పంపించడంతో అక్కడి నుంచి కూడా కార్యకర్తలు, నేతలు నడుచుకుంటూనే వెళ్లారు. ఇటు పులివెందుల రోడ్డు నుంచి సభా ప్రాంగణానికి మూడు కి.మీ మేర జనసంద్రమైంది.

పోలీసుల పనితీరు భేష్

ఉదయం 9 గంటల నుంచే రోడ్లపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. కార్యకర్తలున్న వాహనాలను సభా ప్రాంగణం చుట్టూ ఉన్న పార్కింగ్ ప్రాంతాలకు వన్ బై వన్ పంపించారు. పోలీసులు అడుగడుగునా విధులు నిర్వహిస్తూ ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారు. సభా ప్రాంగణం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

ఆక్టోపస్ సిబ్బందికి సూచనలు

చంద్రబాబు వ్యక్తిగత భద్రతా సిబ్బందికి ఐపీఎస్ అధికారి దీపికా ఎం.పాటిల్ పలు సూచనలు చేశారు. సభాప్రాంగణం వద్ద ఉన్న వారితో ఆమె మాట్లాడారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఉండాలి. ముఖ్యమంత్రి సభ నుంచి కిందకి దిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి. జనాలు రాకుండా రోప్ సహాయంతో ఎలాంటి ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు ఏ విధంగా తీసుకోవాలని వారికి సూచనలు చేశారు.


రోడ్లపై బారులు తీరిన వాహనాలు


ఆక్టోపస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఐపీఎస్ అధికారి దీపిక ఎం.పాటెల్


ట్రాఫిక్‌పై ఎస్ఐతో మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్

అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీతో భద్రత

● పర్యవేక్షించిన ఐజీపీ (ఆపరేషన్స్) సీహెచ్ శ్రీకాంత్

కడప క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడు నేపథ్యంలో గురువారం పబ్బాపురం వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ ద్వారా భద్రత కల్పించారు. ఐజీపీ (ఆపరేషన్స్) సీహెచ్ శ్రీకాంత్ వేదిక వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూము నుంచి స్వయంగా పర్యవేక్షించారు. 23 డ్రోన్లు, నాలుగు అత్యాధునిక టెక్నాలజీ డ్రోన్లను వినియోగిస్తూ భద్రతా ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ సజావుగా సాగేలా పార్కింగ్, బహిరంగ సభ స్థలి వద్ద ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు విహంగ వీక్షణం ద్వారా పర్యవేక్షిస్తూ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.


డ్రోన్ కెమెరా చిత్రాలను పరిశీలిస్తున్న ఐజీపీ శ్రీకాంత్

మహానాడుకు భారీగా జన సమీకరణ

● 40 వేల మందికి ప్రయాణ సౌకర్యం ● 25 వేల మందికి భోజన ఏర్పాట్లు

● అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం పూర్వజన్మ సుకృతం : చమర్తి


కార్యకర్తలతో కలిసి బయలుదేరిన చమర్తి


చమర్తి జగన్‌మోహన్‌రాజును అభినందిస్తున్న లోకేశ్

రాజంపేట, మే 29(ఆంధ్రజ్యోతి): మహానాడు ముగింపు రోజు భారీ బహిరంగ సభ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 40 వేల మందికి వాహన సౌకర్యాలను ఏర్పాటు చేశారు. కార్లు, బస్సులు, మోటారుసైకిళ్లు, ఆటోలు తదితర వాహనాలను నియోజవర్గంలోని ఆరు మండలాల్లో వందలాది వాహనాలను ఏర్పాటు చేశారు. రాజంపేట నుంచి కడప వరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల కార్యకర్తలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాల్లో వచ్చి టీడీపీ కార్యకర్తలకు సుమారు 25వేల మందికి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. భారీ వాహనాల సమూహాల మధ్య కార్యకర్తలతో కలిసి కడప మహానాడు బహిరంగ సభకు చమర్తి తరలివెళ్లారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ తన కోరిక మేరకు అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పునర్నిర్మించాలని ఇచ్చిన విజ్ఞాపన పత్రం మేరకు వెనువెంటనే అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహానాడు సభలో ప్రకటించడం పూర్వజన్మ సుకృతమని, తాను జన్మలో మరచిపోలేనని, ఈ ప్రాజెక్టు నిర్మిస్తే రాజంపేట సస్యశ్యామలవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాయకత్వంపై అచెంచల విశ్వాసంతో రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాదిగా జనాలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. దీంతో జగన్ సొంతగడ్డపై తెలుగుదేశం పార్టీ సత్తా ఏమిటో రుజువైందన్నారు. దీనిని బట్టి వచ్చే ఎన్నికల్లో టీడీపీ 10కి 10 స్థానాలు ఉమ్మడి కడప జిల్లాలో కైవసం చేసుకోవడం తథ్యమన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కడప కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడు సందర్భంగా గత మూడురోజులుగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చివరి రోజు బహిరంగసభ ప్రాంగణంలో నిర్వహించిన సత్యమాస్టర్ డ్యాన్స్ టీం ఆధ్వర్యంలో 25 మంది కళాకారులు నృత్యప్రదర్శన నిర్వహించారు. రేలారే రేలా జానకిరావు ఆధ్వర్యంలో జానపద నృత్య కళాకారులతో సందడి చేశారు. కొండపల్లి ఉదయకుమార్ టీం జానపద నృత్యం, రమణ టీం నృత్య ప్రదర్శన, ఎస్కే రాజు తెలంగాణ జానపదాలు, తెలంగాణ నృత్య ప్రదర్శనలు, అలాగే హరిబాబు, జోగి క్రిష్ణంరాజు నాటక ప్రదర్శన ఇచ్చారు.

మహానాడు బహిరంగ సభకు 875 బస్సులు

కడపకల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి కడప రీజియన్‌లోని ఆరు డిపోలతో పాటు మిగతా జిల్లా నలుమూలల నుంచి దాదాపు 875 బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ బస్సుల ద్వారా వివిధ ప్రాంతాల నుంచి మహా బహిరంగ సభకు పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తలు అభిమానులను తరలించారు. దీంతో రహదారులన్నీ పూర్తిగా జనంతో కిక్కిరిసిపోయాయి. బహిరంగసభ అనంతరం తిరిగి అంతే సురక్షితంగా కార్యకర్తలను బస్సుల ద్వారా గమ్యస్థానాలకు చేర్చారు.



మహానాడులో 'మేము సైతం'

కడపరూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో మూడవ రోజు నిర్వహించిన ప్రజాబహిరంగ సభకు బాల బాలికలు మేము సైతం అంటూ వారి తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. జెండాలను చేతబట్టి ఉత్సాహంగా నడుచుకుంటూ తరలివచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు, టీడీపీకి జై అంటూ ముందుకు సాగారు. బహిరంగసభ ముగిసిన అనంతరం వారి ప్రాంతాలకు పయనమయ్యారు.



వైసీపీ ఎంపీపీపై అనర్హత వేటు

ముద్దనూరు మే 29 (ఆంధ్రజ్యోతి):ముద్దనూరు మండల వైసీపీ ఎంపీపీ కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డిపై అనర్హత వేటు వేస్తూ జడ్పీ సీఈవో ఓబులమ్మ ఆదేశాలు జారీ చేశారు. ప్రదీప్ కుమార్‌రెడ్డి శెట్టివారిపల్లె ఎంపీటీసీగా గెలుపొందారు. మండలంలో వైసీపీ ఎంపీటీసీ సభ్యుల బలం ఉండటంతో కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపీపీగా ఎన్నుకున్నారు. అయితే ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న మండల సర్వసభ్య సమావేశాలకు వరుసగా గైర్హాజరవుతుండటంతో గతంలో నుంచి ఇప్పటి వరకు ఉన్న ఎంపీడీవోలు జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఈవో ఓబులమ్మ శెట్టివారిపల్లె ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్‌రెడ్డిపై అనర్హత ప్రకటించి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి తెలిపారు.

1 నుంచి సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో జూన్ 1వ తేదీ నుంచి ఏసీఏ సౌత్ జోన్ అండర్ 23 మెన్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఇందులో కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడనున్నాయి. ఇందులో భాగంగా 1వ తేదీ రిమ్స్ వద్ద గల వైఎస్ఆర్ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య అలాగే కేఎస్ఆర్ఎం స్టేడియంలో అనంతపురం, నెల్లూరు జట్ల మధ్య, తిరిగి 2న కర్నూలు - నెల్లూరు, అదేరోజు కడప - చిత్తూరు మధ్య మ్యాచ్ లు జరగనున్నాయి. 3న ఆటకు విశ్రాంతి దినం. 4న అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య, కడప-నెల్లూరు, 5న చిత్తూరు-నెల్లూరు, అనంత పురం-కర్నూలు జట్ల మధ్య జరగనుంది. 6న విశ్రాంతి దినం, 7న అనంతపురం-కడప, చిత్తూరు -కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నట్లు వెల్లడించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

నందలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 31న నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులకు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లపై శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని.. అందుకు పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలను చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టూరిజం అధికారి నాగభూషణం, ఎంపీడీవో రాధాకృష్ణంరాజు, ఈవోఆర్డీ సునీల్‌కుమార్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, ఎంఈవోలు అనంతకృష్ణ, నాగయ్య, ఏవో మల్లికార్జున, ఏపీఓ మురళి, ఏపీఎం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

● 328 మందికి సీట్లు ఖరారు


సీటు సాధించిన విద్యార్థికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

పీలేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఏపీఆర్‌జేసీ గురుకులాల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 328 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు రాయలసీమ రీజియన్ కన్వీనర్ డా.ఎం.చెన్నకేశవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ రీజియన్ పరిధిలోని గ్యారంపల్లె, కొడిగెనహళ్లి, కర్నూలులోని ఉర్దూ మైనారిటీ బాలుర కళాశాలల్లో అడ్మిషన్ల కోసం సోమవారం ఎంపీసీ గ్రూపునకు 123 మంది, మంగళవారం బైపీసీ గ్రూపులో 119 మంది, బుధవారం ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 86 మంది విద్యార్థులు సీట్లు సాధించారని ఆయన వివరించారు. సీట్లు సాధించిన విద్యార్థులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్యారంపల్లె ప్రిన్సిపాల్ బ్రహ్మాజీ, కొడిగినహల్లి ప్రిన్సిపాల్ జలజ, కర్నూలు మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ ముబషిర బేగం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిట్‌ఫండ్ కార్యాలయానికి తాళాలు వేసిన సంఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. రామమోహన్‌రెడ్డి, అతని భార్య రత్నమ్మ కపిలేశ్వర చిట్‌ఫండ్ కంపెనీలో ఇద్దరి పేర్లపై ఐదు లక్షల చిట్స్ 2020 సెప్టెంబరు నెలలో వేశారు. చిట్స్ పూర్తి అయినా అమౌంట్ చెల్లించకపోవడం, చిట్‌ఫండ్ యజమాని సీకే నాయుడు, మేనేజరు నరసింహులు ఈ విషయంపై స్పందించక పోవడంతో బుధవారం చిట్‌ఫండ్ కంపెనీ కార్యాలయానికి తాళాలు వేశారు. విషయం తెలుసుకున్న చిట్‌ఫండ్ ఎండీ పొద్దుటూరు నుంచి కొంత మంది మనుషులతో మదనపల్లెకు వచ్చి, బాధితులు వేసిన తాళాలను పగలగొట్టాడు. చీటీ డబ్బులు ఇస్తామని బాధితులను కార్యాలయానికి రప్పించి వారిపై దాడి చేసి గాయపరిచారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు చిట్‌ఫండ్ యాజమాని సీకే నాయుడు, మదనపల్లె బ్రాంచి మేనేజరు నరసింహులతోపాటు మరో పదిమందిపైన, బాధితులు రామమోహన్‌రెడ్డి, రత్నమ్మతో పాటు మరో కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంటి నిర్మాణదారులకు నోటీసులు

పీలేరు, మే 29(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం జామియా మసీదు సమీపంలోని వక్ఫ్ బోర్డు స్థలంలో ఇంటి నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఈవో గురుమోహన్ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేశారు. పీలేరు పంచాయతీ పరిధిలోని సర్వే నెం.292లో 3.2 సెంట్లలో నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవని, వాటిని తక్షణ మే నిలిపివేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు నుంచి అందిన సమాచారం మేరకు ఈవో ఈ నోటీసులు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న ఇంటితోపాటు స్థలానికి చెందిన ధ్రువీకరణ పత్రాలతో తక్షణమే గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని నోటీసులో పేర్కొన్నారు.

జెండాలు, ఫ్లెక్సీల ధ్వంసం కేసులో 13 మంది అరెస్టు


పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పులివెందుల, మే 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండాలను, ఫ్లెక్సీలను, తోరణాలను ధ్వంసం చేసిన కేసులో 13 మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మురళీనాయక్ తెలి పారు. బుధవారం పార్నపల్లె, నల్లపురెడ్డిపల్లె సర్కిళ్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహానాడు సందర్భంగా జెండాలు, ఫ్లెక్సీలు, తోరణాలను ఏర్పాటు చేశారు. వైఎస్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేశారనే నెపంతో వైసీపీకి చెందిన పలువురు వీటిని ధ్వంసం చేశారు. జెండాలు పీకేసి, తోరణాలు తొలగించి, ఫ్లెక్సీలను కూలదోశారు. దీనిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 15 మందిపై కేసు నమోదు చేసి 12 మందిని అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం వీరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్‌చైర్మన్ హఫీజుల్లా, కోఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి , పార్నపల్లె కిషోర్, కావేటి మల్లికార్జున, రాజా, తరుణ్, ఎ.ఖాదర్ బాష, ఓ.రసూల్, మస్తాన్, సాతుపాటి వెంకటచలపతి తదితరులను అరెస్టు చేసి.. వైద్యపరీక్షల అనంతరం గురువారం రాత్రి కోర్టులో హాజరుపరిచామన్నారు.

మేయర్ సురేశ్‌బాబు తొలగింపుపై హైకోర్టు స్టే

● వైసీపీ కార్పొరేటర్లు, నాయకుల సంబరాలు


మేయర్ సురేష్‌బాబుకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబు కుటుంబ సభ్యులు కాంట్రాక్ట్ పనులు చేశారు. అది మున్సిపల్ చట్ట వ్యతిరేకమని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి మున్సిపల్‌శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మేయర్‌కు వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసు జారీ చేశారు. దీనిపై సురేశ్‌బాబు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి తన వివరణను సమర్పించారు. అయితే ఆ ఎక్స్‌ప్లనేషన్ సరిగా లేకపోవడంతో మేయర్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్వర్వులను సవాల్ చేస్తూ సురేశ్‌బాబు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం హైకోర్టు డివిజనల్ బెంచ్ విచారణ జరిపి న్యాయస్థానం స్టే విధించినట్లు సమాచారం.

వైసీపీ సంబరాలు : మేయర్ సురేశ్‌బాబు తొలగింపుపై హైకోర్టు డివిజనల్ బెంచ్ స్టే మంజూరు చేసినట్లు సమాచారం రావడంతో వైసీపీ కార్పొరేటర్లు నాయకులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. గురువారం కడప నగరం చిన్నచౌక్ మేయర్ కార్యాలయంలో కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందన్నారు. ఎమ్మెల్యే మాధవి చేసిన కుయుక్తులు ఏవీ ఫలించలేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్‌తో పాటు కార్పొ రేటర్లు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి

● అధికారికంగా ఉత్తర్వులు జారీ

కడప రూరల్, మే 29 : కడప జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా అట్లూరు మండలం వేములూరు గ్రామానికి చెందిన మంచూరు సూర్యనారాయణరెడ్డిని నియమిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్వర్వులను జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆయన పేరును ఏప్రిల్ 28న ప్రకటించిన నేపద్యంలో బుధవారం అధికారికంగా తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక డీసీసీబీ డైరక్టర్లను కూడా ప్రభుత్వం వీలైనంత త్వరలో ప్రకటించనున్నట్లు వినికిడి. డైరక్టర్ల ప్రకటన వెలువడగానే డీసీసీబీ చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. అప్పటి వరకు డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్ కొనసాగనున్నారు.

కడప జిల్లా ఇంటర్మీడియట్ అధికారిగా సుబ్రమణ్యం

కలికిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో)గా జేవీఎస్ఎస్ సుబ్రమణ్యంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పుగోదావరి జిల్లా దవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యంకు పదోన్నతి కల్పిస్తూ ఖాళీగా వున్న స్థానంలో కడప డీఐఈవోగా నియమించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

గ్రేడ్ 2 మున్సిపాలిటీగా ఎర్రగుంట్ల నగరపంచాయతీ

ఎర్రగుంట్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగర పంచాయతీని గ్రేడ్-2 మున్సిపాలిటీగా మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2012 మార్చిలో జిల్లాలో మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఎర్రగుంట్లను నగర పంచాయతీగా మార్చారు. ప్రస్తుతం గ్రేడ్-2 మున్సిపాలిటీగా మారుస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు గురువారం (మే 29న) గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైనట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

● ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ చెముళ్లపల్లెకు చెందిన సతీష్‌కుమార్

చెన్నూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కొత్త రోడ్డు వద్ద గురు వారం రాత్రి మద్యం తాగిన ఇద్దరు యువకులు గొడవ పడ్డారు. ఒకరిపై మరొకరు కత్తితో దాడి చేసుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. ఖాజీపేట మండలం చెము ళ్లపల్లెకు చెందిన ములపాకు సతీష్‌కుమార్ (23), చెన్నూరు లక్ష్మీన గర్‌కు చెందిన సుబ్బరాయుడు బుధవారం రాత్రి ఫుల్‌గా మద్యం తాగి తిట్టుకుంటూ ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో సుబ్బరాయుడు కత్తితో సతీష్‌కుమార్‌పై దాడి చేసి పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు సతీష్‌ను చికిత్స నిమిత్తం కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే స్థానికులు మాత్రం ఇరువురి మధ్య గతంలో పాత గొడవలు ఉండటంతోనే దాడి చేసుకున్నారని చెబుతున్నారు.

యుద్ధనీతి, పాలన దక్షతలో దిట్ట అహల్యభాయి

● కేంద్ర సహాయ మంత్రి మురుగన్


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి మురుగన్

రాయచోటిటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): యుద్ధనీతి పరిపాలన దక్షత కలిగిన మహనీయురాలు పుణ్యశ్లోక అహల్యభాయి హోల్కర్ అని కేంద్ర సమాచార ప్రసారశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి మురుగన్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న అహల్యభాయి త్రిశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల సాయిశుభా కల్యాణ మండపం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అధ్యక్షతన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ మాట్లాడుతూ పుణ్యశ్లోక రాణి అహల్యభాయ్ హోల్కర్ చిన్నతనం నుంచి చూపించిన ధీరోధారతా యుద్ధ నైపుణ్యత కాశీ నుంచి కన్యాకుమారి వరకు దేవాలయాల పునర్నిర్మాణం కోసం ఆమె చేసిన కృషి అమోఘం అన్నారు. అలాగే దేశ ఆర్థిక ఉన్నతి కోసం పలుచోట్ల గాట్ల నిర్మాణం చేపట్టి ఎగుమతులను, దిగుమతులను ప్రోత్సహించారన్నారు. అప్పటి కాలంలో ఆమె చేపట్టిన పలు కార్యక్రమాలకు ప్రస్తుతం మోడీ చేపడుతున్న అనేక కార్యక్రమాలకు దగ్గర సారూప్యత ఉందని విపులంగా వివరించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ మాట్లాడుతూ మహిళల స్వావలంబన కోసం ఆమె ఎంతో కృషి చేశారన్నారు. చేనేత కార్మికుల కోసం వాళ్ల నేసిన చీరలు ఆమె స్వయంగా ధరించి ప్రచారం చేయడం అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. కార్యక్రమంలో శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగో తు రమేశ్ నాయుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్, జిల్లా అధ్యక్షురాలు సునీతనారాయణవర్మ, బాలజ్యోతి, నిర్మల్‌కుమార్, రేపన శివప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్‌కుమార్‌రాజు, కృష్ణయాదవ్, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా మాతంగ మహా పీఠం శిలాశాసన ప్రతిష్ఠ


పీఠంలో 108 అగ్ని హోమాలు ఏర్పాటు చేసిన దృశ్యం


పీఠం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు

లక్కిరెడ్డిపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కిరెడ్డిపల్లె లోని దొర్రిచెరువు సమీపాన మాతంగ మహా పీఠం శిలా శాసన ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురువారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సమాచార, ప్రసారశాఖ సహాయ మంత్రి మురగన్, కర్ణాటక పౌరసరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి రాజనర్సింహ, కర్ణాటక శ్రీహరిపురం పీఠాధిపతులు శిలాఫలకాన్ని ప్రారంభించారు. ముందుగా శ్రీమాతాంగ పీఠం మాతాంగ నందగిరిస్వామిజీ (నూకల రవీంద్ర) సారథ్యంలో 108 హోమ గుండాలతో జంట దంపతులతో యాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నాలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. కాగా, దొర్రిచెరువు సమీపంలో 10 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న మహా పీఠానికి దాదాపు రూ.69 కోట్లు వెచ్చిస్తున్నట్లు పీఠం పీఠాధిపతి మాతాంగ నందగిరిస్వామి తెలియజేశారు. కార్యక్రమానికి పీఠం కమిటీ సభ్యులు శివగంగిరెడ్డి, డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డితో పాటు దాతలు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటక శ్రీహరిపురం పీఠాధిపతి ఆదిశంకరచార్య శారద లక్ష్మీనరసింహస్వామి, పీఠం అధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి కమలానంద భారతి స్వామిజీ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె ప్రాంతంలో మాతాంగ పీఠం ఏర్పాటుతో ధార్మిక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. మాతంగి పీఠం అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర మంత్రి మురగన్, కర్ణాటక పౌరసరఫరాల శాఖ మంత్రి కేహెచ్ మునియప్ప, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ పీఠంలో గోశాల, అన్నశాల ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ జిల్లా నాయకులు వీహెచ్‌పీ ఎనమల విశ్వనాధ్, వెంక్రమణ (గురుస్వామి), బీజేపీ రామచంద్రారెడ్డి, కృష్ణ, సుబ్బయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఉషారాణి, సీఐ కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడప సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్‌పై విచారణ

కలికిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్. కమలాకర్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విశాఖపట్నం కేంద్ర కారాగారంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కమలాకర్‌ను కడప కారాగారానికి గతంలో అటాచ్ చేశా రు. ఈయన విశాఖపట్నం జైలు బాధ్యతలు నిర్వహిస్తున్న కాలంలో ఉప్పాడ గౌరీశంకర్ అనే శిక్ష పడిన ఖైదీ 2024 జూలై 30న జైలులో ఉరేసు కుని మరణించాడు. దీనికి ప్రధాన కారణం శిక్ష పడి కొత్తగా జైలుకొచ్చిన ఖైదీని జైలు నిబంధనల ప్రకారం కొద్ది కాలంపాటు జైలులో పలు జాగ్రత్త లతో ప్రత్యేక బ్యారెక్‌లో వుంచి అప్రమత్తంగా పరిశీలించాల్సి వుంది. అలా కాకుండా మృతుడు ఖైదీ గౌరీశంకర్‌ను జైలుకు వచ్చిన మరుసటి రోజే ఇతర ఖైదీలున్న సాధారణ బ్యారెక్‌కు తరలించారు. ఖైదీ ఉరేసుకుని చనిపో వడానికి ఇదే ప్రధాన కారణంగా నిర్ధారించారు. ఇందులో డిప్యూటీ సూపరిం టెండెంట్ కమలాకర్ తీవ్ర నిర్లక్ష్యం, దుష్ప్రవర్తనలు ప్రధానంగా కారణమ య్యాయని కూడా నిర్ధారించారు. ఈ సంఘటనలో కమలాకర్‌తో సహా మొత్తం ఆరుగురు సహచరులను కూడా బాధ్యులుగా తేల్చారు. దీనిపైన గత జనవరి 29న ప్రభుత్వం కమలాకర్ నుంచి వివరణ కోరింది. అయితే కమలాకర్ సంజాయిషీలు సహేతుకంగా లేవని భావించిన ప్రభుత్వం అత నితో సహా మొత్తం ఆరుగురిపై విచారణ జరిపించాలని నిర్ణయించింది. తాజాగా గుంటూరు రేంజి జైళ్ళ శాఖ డీఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్‌ను విచా రణాధికారిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల లోగా విచారణ నివేదికను సమర్పించాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

కడప రిటైర్డు సైక్రియాట్రీ ప్రొఫెసర్‌పై..

కలికిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ హెల్త్‌లో సైక్రియాట్రీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన డాక్టర్ రాధాకృష్ణ రాజుపై విచారణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం ఆయనకు నోటీసులు జారీ చేసింది. నోటీసులతోపాటు విచారణకు దారితీసిన అంశాలను కూడా ఆయనకు పంపించారు. ప్రభుత్వం నమోదు చేసిన అభియోగాల ప్రకారం.. డాక్టర్ రాధాకృష్ణ రాజు తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రొఫెసర్‌గా పనిచేస్తూ 2023 అక్టోబరు 14 నుంచి 2024 ఏప్రిల్ 17 వరకూ విధులకు గైర్హాజరయ్యారు. దీనికి సంబంధించి ఎలాంటి ముందస్తు సెలవు కూడా తీసుకోలేదు. ఆయన నిర్లక్ష్యం కారణంగా ఆ వైద్య విభాగంలో బోధనా పరంగా, చికిత్సల పరంగా తీవ్ర ఇబ్బందులెదురయ్యాయి. ఈ నేపథ్యంలో 2024 ఏప్రిల్ 18న ఆయన నేరుగా వైద్య విద్య డైరెక్టరు ముందు హాజరయ్యారు. దీనిపై తీసుకోవాల్సిన క్రమశిక్షణా చర్యలను పెండింగ్‌లో పెడుతూ అదే నెల 18వ తేదీ కడప మెడికల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లో నియమించారు. దీనిపై ప్రస్తుతం విచారణ చేయించాలని సంకల్పించారు. ఈ మేరకు ప్రాథమికంగా ఆయనకు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి గురువారం ఆదేశాలిచ్చారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పెంపు

కడప/రాయచోటి కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడేషన్ల గడువు మూడు నెలలు పెంచుతూ సమాచార పౌర సంబంధాలశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, కడప డీఐపీఆర్వో వేణుగోపాలరెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న జర్నలిస్టులకు మాత్రమే మరో 3నెలల పాటు (జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు) ఈ పొడిగింపు వర్తిస్తుందన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యం వారి సంస్థలో పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలను ఆయా జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ కార్యాలయంలో అందజేయాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.

అంజన్నను దర్శించుకున్న పీఠాధిపతులు

చక్రాయపేట,మే 29 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని గురువా రం గన్నవరం, విజ యవాడ భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానందభారతి, బ్రహ్మంగారిమఠం ఆశ్రమం జ్ఞానేంద్రస్వామిలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు కేసరి, సిబ్బంది వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చరిత్ర, మహిమలు అడిగి తెలుసుకున్నారు.


మదనపల్లె నుంచి మహానాడుకు వెళుతున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


ములకలచెరువు నుంచి మహానాడుకు బయలుదేరుతున్న జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి, నాయకులు


గువ్వలచెరువు వద్ద మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి భోజన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

పసుపు పండుగకు తరలిన తెలుగు దండు

మదనపల్లె, మే 29(ఆంధ్రజ్యోతి): మహానాడుకు మదనపల్లె నుంచి టీడీపీ శ్రేణులు భారీగా వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు ఆధ్వర్యంలో వేర్వేరుగా నాయకులు, కార్యకర్తలు , పార్టీ అభిమానులు పెద్దసంఖ్యలో తరలి వెళ్లారు. గురువారం రెండు నియోజకవర్గాల నుంచి 350 వాహనాలు వెళ్లాయి. ఇందులో 95 ఆర్టీసీ బస్సులు కాగా, ప్రైవేటు స్కూల్స్, కళాశాలల బస్సులతోపాటు సొంత కార్లు, ట్యాక్సీలు ఉన్నాయి. మదనపల్లె మున్సిపాలిటీలో 35 వార్డులుండగా ఒక్కో వార్డుకు రెండు బస్సులు కేటాయించారు. వీటిలో స్వయంసహాయక సంఘాల సభ్యులు, లీడర్లు, ఆర్పీల ఆధ్వర్యంలో మహిళలు పెద్దసంఖ్యలో వెళ్లారు. నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు కేటాయించిన బస్సులు, ఇతర వాహనాల్లో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఇందులో భాగంగా బసినికొండ పంచాయతీ గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సులు, అయిదు కార్లలో మహానాడుకు చేరుకున్నారు. మున్సిపాలిటీ 13 వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఎస్.ఎ.నస్రీన్‌తాజ్, మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఎస్.ఎ.మస్తాన్ ఆధ్వర్యంలో మోతీనగర్, శేష్ మహల్ ఏరియా, ఎన్వీఆర్ లేఅవుట్ ప్రాంతాలకు చెందిన 60 మంది మహిళలు వెళ్లారు. మరోవైపు సీఎం చంద్రబాబు నాయుడు మూడోసారి జాతీయ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు.. మహానాడులో సీఎంను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

తంబళ్ల పల్లి నుంచి 250 బస్సులు.. 300 కార్లు

ములకలచెరువు: తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆరు మండలాల నుంచి 250 బస్సులు, 300 కార్లలో టీడీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి, పారిశ్రామికవేత్త మంత్రి గిరిధర్‌రెడ్డితో పాటు ముఖ్యనాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివెళ్లారు. వారి కోసం గువ్వలచెరువు వద్ద ఏర్పాటు చేసిన భోజన ఏర్పాట్లను మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో కలిసి ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పరిశీలించారు. మహానాడు బహిరంగ సభలో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ పలకరించారు.

గుర్రంకొండ : మండలంలోని ప్రతి గ్రామం నుంచి పదుల సంఖ్యలో వాహనాల్లో మహానాడుకు వెళ్లారు. అన్ని గ్రామాల నుంచి వాహనాలు ఓ చోటకు చేరుకుని అక్కడి నుంచి బయలుదేరాయి. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడ : కలకడ మండలం నుంచి మహానాడుకు భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. ఇందులో భాగంగా వందలాది వాహనాల్లో టీడీపీ నాయకులు బహిరంగ సభకు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : నియోజకవర్గ ఇంచార్జి జయచంద్రారెడ్డి నేతృత్వంలో అన్ని గ్రామాల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు సుమారు 250 పైగా. బస్సులు, కార్లు, సుమోలు, ద్విచక్రవాహనాల్లో ఉత్సాహంగా వెళ్లారు. మహానాడుకు వెళ్తున్న వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, వీరాంజినేయులు, కాలానారాయణ, జగదీశ్ తదితరులు వెళ్లారు.

రామసముద్రం: మండల టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్ గౌడు ఆధ్వర్యంలో 55 బస్సులలో తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. ప్రతి పంచాయతీ నుంచి రెండు మూడు బస్సులలో కార్యకర్తలు, అభిమానులు, వచ్చేవిధంగా చర్యలు తీసుకున్నారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు మునివెంకటస్వామి, మాజీ సర్పంచులు రెడ్డిశేఖర్, శివప్ప, కమ్మవారిపల్లె సర్పంచ్ ఇంజం వెంకటరమణనాయుడు, నాయకులు ప్రదీప్‌రెడ్డి, సీనప్ప, వేణుగోపాల్, బాబుసాంబ్, గబ్బూరి బద్రీనాథ్, స్థానికం రాజేంద్ర, చెంగారెడ్డి, ఉబేద్, బండ్ల జనార్దన్, రూపేష్‌రెడ్డి, వికాస్‌స్వామి, లోకనాథరాజు, ఎల్.శివ, మంజునాథ్‌రెడ్డి, వాల్మీకి కిట్ట, గోపాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

పీలేరు: మండలం నుంచి సుమారు 3 వేల మంది తరలి వెళ్లారు. రెండు రోజులుగా స్థానిక నాయకులు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జులతో సమన్వయం చేసుకుంటూ ఉండడంతో టీడీపీ శ్రేణులతోపాటు సాధారణ ప్రజలు కూడా కడపకు వెళ్లారు. పార్టీ ఏర్పాటు చేసిన వాహనాలతోపాటు స్వయంగా సమకూర్చుకున్న వాహనాల్లో చాలామంది పయనమయ్యారు. మహానాడుకు తరలుతున్న శ్రేణులతో పీలేరు నాలుగు రోడ్ల కూడలిలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సందడి నెలకొంది.

బి.కొత్తకోట : మండలం నుంచి గురువారం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బి.కొత్తకోటతో పాటు మండలంలోని గట్టు, బడికాయలపల్లె, గొల్లపల్లె తదితర గ్రామాల నుంచి ఉదయాన్నే బస్సులు, ఇతర వాహనాల్లో తరలివెళ్లారు.

నిమ్మనపల్లి: మండలం నుంచి వేలాదిగా తరలివెళ్లిన కార్యకర్తలు దాదాపు 6నుంచి 7కిలోమీటర్ల దూరం వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో సభాస్థలికి చేరుకొనేందకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ జామ్ కారణంగా చాలామంది ప్రజలు మహానాడు భహిరంగ సభ వద్దకు చేరుకోలేక పోయారని తెలిపారు. ఈయన వెంట సర్పంచ్ మధు, గ్రామ అధ్యక్షుడు వెంకటరమణ, నరసింహారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలికిరి : చిత్తూరు, కుప్పం, పుంగనూరు, కలికిరి, పీలేరు వాహనాలన్నీ చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై గువ్వలచెరువు వరకే సాఫీగా వెళ్లగలిగాయి. గువ్వలచెరువు వద్ద రహదారి పక్కన స్థానిక నాయకులు భోజనాలు ఏర్పాటు చేయడం తో, వాహనాలన్నీ అక్కడే ఆగిపోయాయి. దీంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. కిలోమీటర్ల దూరం వాహనాలన్నీ గంటల కొద్దీ ఆగిపోయాయి. దీంతో సభకు హాజరుకావడా నికి తీవ్ర జాప్యం జరిగిందని పలువురు నాయకులు, కార్య కర్తలు నిరాశ వ్యక్తం చేశారు.


మదనపల్లె: నస్రీన్‌తాజ్ ఆధ్వర్యంలో మహానాడుకు వెళ్తున్న మహిళలు


మహానాడుకు తరలుతున్న పీలేరు టీడీపీ శ్రేణులు


గుర్రంకొండ నుంచి మహానాడుకు బయలుదేరిన టీడీపీ నాయకులు


బి.కొత్తకోట:మహానాడుకు తరలివెళ్తున్న గట్టు కార్యకర్తలు

మురుగు కాలువలకు మహర్దశ

- బుగ్గ కాలువ, బాహుదాలో పూడిక తొలగింపు

మదనపల్లె, మే 29(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు ముమ్మరం కావడంతో మదనపల్లె మున్సిపాలిటీలో ప్రవహించే బాహుదా, బాపన కాలువలకు మహర్దశ కలుగనుంది. గతేడాది 15వ ఆర్థికసంఘం నిధులు మంజూరు కావడంతో బాహుదా, బాపన కాలువతో పాటు కురవంక గుండా బాహుదాలో కలిసే కాలువను శుభ్రం చేస్తున్నారు. పట్టణంలోని రెండు డివిజన్లలో మూడు ప్రధాన కాలువలు, 40పైగా అంతర్గత కాలువల్లో పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపడుతున్నారు. ఇందులో యంత్రాలు, కార్మికులు చేసేలా మూడు విభాగాలుగా రూ.32 లక్షలతో పనులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో వారం రోజులుగా పనులు చేస్తున్నారు. టీచర్ కాలనీ నుంచి బాహుదా కాలువను పెద్దతోపు వరకూ, మాదినికొండ నుంచి ప్రారంభమయ్యే బుగ్గకాలువ, కురవంకల్లో అంచెలంచెలుగా పనులు చేస్తున్నారు. మిగిలిన 40పైగా అంతర్గత కాలువల పనులను కాంట్రాక్టర్లు.. ప్రైవేటు కూలీలతో చేయిస్తున్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు రోజువారీ విధుల్లో బిజీగా ఉంటుండగా, అంతర్గత కాలువల నిర్వహణను టెండర్లలో చేర్చారు. పెద కాలువల్లో పూడిక తీత, పిచ్చిమొక్కలు తొలగించడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగిపోయినట్లు అ యింది. దీంతో కాలువల వెంబడి నివాసముంటున్న వారికి దుర్వాసన, దోమల బెడద నుంచి కాస్త ఉపశమనం లభించింది. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, డీఈ శ్రావణి, ఏఈ రూపేష్‌లు పర్యవేక్షిస్తున్నారు.


బుగ్గకాలువలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్


గోపిదిన్నె నుంచి మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు


నిమ్మనపల్లె: కడప మహానాడులో పాల్గొన్న టీడీపీ నేతలు

అధిక ఉత్పత్తి లక్ష్యంగా
'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్'

పీలేరు, మే 29 (ఆంధ్రజ్యోతి): అధిక ఉత్పత్తి సాధించడం ద్వారా రైతుల జీవనప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం అమలు చేస్తోందని కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 29 నుంచి జూన్ 12 వరకు నిర్వహించాల్సిన ఈ కార్యక్రమాన్ని అధికారులు, శాస్త్రవేత్తలు గురువారం కేవీపల్లె మండలం చిన్నకమ్మపల్లెలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పాటించాల్సిన సాగు పద్ధతులు, నూతన సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలోనూ రైతులతో ముఖాముఖి నిర్వహిస్తామన్నారు. తద్వారా రైతులు, అధికారులు, శాస్త్రవేత్తల మధ్య దూరం తగ్గించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సలహాలు, సూచనలను విధిగా పాటించాలని ఆయన రైతులను కోరారు. అనంతరం వ్యవసాయంలో యాంత్రీకరణపై కలికిరిలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు డా.కె.హేమనారాయణ రెడ్డి అవగాహన కల్పించారు. వరి, వేరుశెనగ, అలసంద పంటల్లోని కొత్త వంగడాలను కేవీకే శాస్త్రవేత్త డా.కె.మాధురి రైతులకు పరిచయం చేశారు. టమోటా పంటలో వినియోగించాల్సిన జీవన ఎరువుల, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై ఉద్యాన శాస్త్రవేత్త డా.ఎ.శ్రీనివాసులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పీలేరు ఏడీ రమణరావు, ఉద్యాన అధికారి సుకుమార్ రెడ్డి చిన్నకమ్మపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి, రెడ్డప్ప, ఎంజీవీ రమణ, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త ఎ.శ్రీనివాస్

పురాతన ఆలయాల పరిశీలన

చిట్వేలి, మే 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వరదరాజ , వీరభద్రస్వామి ఆలయాలను గురువారం దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, రాజంపేట సమూహ దేవాలయాల అధికారి కొండారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ లక్షుమయ్య పరిశీలించారు. వరదరాజస్వామి ఆలయానికి సంబంధించిన సర్వేనంబరు 383లో 83 సెంట్ల ఖాళీ స్థలాన్ని, వీరభద్రస్వామి ఆలయంలోని సర్వే నంబరు 165లో 2.28 ఎకరాల భూమిలో ఉన్న 60 మామిడి చెట్లను పరిశీలించారు. మామిడిచెట్లను గుత్తకు ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్వేయర్‌ను కలిసి భూములకు సంబంధించిన హద్దులను గుర్తించామని కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకుడు అరవిందస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి సన్నిధిలో కన్నా

నందలూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌమ్యనాథ స్వామి ఆలయాన్ని సత్తెనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనను సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యెద్దల విజయసాగర్ పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా అన్నదానం

మదనపల్లె అర్బన్, మే 28: స్థానిక ఆర్టీసీ వన్ డిపోలో ఎన్టీఆర్ జయంతిని పురస్క రించు కుని ఏపీపీటీడీ కార్మిక పరిషత్(టీడీపీ అనుబంధ విభాగం)ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిషత్ వన్ డిపో గౌరవాధ్యక్షుడు గుత్తికొండ త్యాగరాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సినీ రంగంలోను, రాజకీయ రంగంలోను పేద ప్రజలకు సేవలందించారన్నారు. ఆనాడు ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని ఢిల్లీ పెద్దలు తొక్కి పెడితే దీనికి మూల్యం చెల్లించడానికి 1982లో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. అప్పట్లో పేదల కోసం రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం, మండలాల వ్యవస్థ తీసుకొచ్చారన్నారు. పేద ప్రజల సంక్షేమానికి తోడ్పాటును అందించారని గుర్తు చేశారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో పాలన చేశారన్నారు. అనంతరం ఆర్టీసీ ఆవరణలో కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ వన్ డిపో అధ్యక్షుడు ఆర్‌జేఎన్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, ట్రెజరర్ ప్రేమనాథరెడ్డి, జాయింట్ కార్యదర్శి చలపతి, సభ్యులు రవీంద్రనాయక్, రమణ పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న త్యాగరాజు

రాజకీయ సమావేశాలకు డ్వాక్రా మహిళలా? : సీపీఐ

మదనపల్లె అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలను రాజకీయ పార్టీల సమావేశాల కు బలవంతంగా తరలించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల్లో రాజకీయ జోక్యం సరికాదన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలను బలవంతంగా రాజకీయ పార్టీలకు తీసుకెళ్లడం, మీటింగ్‌కు రాకపోతే గ్రేడింగ్ తగిస్తామని హెచ్చరించడం సరికాదన్నారు. సంఘ మిత్రల ఆర్థిక దోపిడీ వల్లే పాలక వర్గాలకు వీరిపై పెత్తనానికి అవకాశం ఇస్తున్నారని ఆరోపించారు. మహిళలు తమ పనులను వదులుకుని రాజకీయ సమావేశాలకు హాజరు కావాల్సి వస్తోందన్నారు. దీనిపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు

దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవాలి

మదనపల్లె అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవాలని, ఉగ్రవాదం అంతం ప్రజలందరి ఐక్యతతో సాధ్యం అవుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం దాడి పాక్ యుద్ధం అనంతరం అమెరికా ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. పహల్గాం ఉగ్రవాదుల నుంచి పర్యాటకుల్ని రక్షించడంలో కాశ్మీర్ ప్రజలు మతాలకు అతీతంగా ఉన్నారన్నారు. అమెరికా తన ఆధిపత్యం కోసమే పాక్‌పై భారత్ యుద్ధంలో జోక్యం చేసుకుందన్నారు. భారతదేశంపై ఇతర దేశాల పెత్తనం దేశ సౌభ్రాతృత్వానికే ప్రమాదం అన్నారు. కల్నల్ సోఫియా ఖురేషీని ఉగ్రవాదుల సోదరి అని అభివర్ణించడం, ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా ఉగ్రవాదమే అన్నారు. బీజేపీ నిర్వహించిన తిరంగ్ యాత్ర దేశ సమైక్యతను సూచించే విధంగా కాకుండా ప్రజల మధ్య విద్వేషాలు పెంచే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహు, నాగరాజ, రమణ, చిన్ని కృష్ణ, జయబాబు, తదితరులు పాల్గొన్నారు.

పీలేరుకు చేరిన వేరుశెనగ విత్తనాలు

పీలేరు, మే 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పీలేరు మండలానికి 1644 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు అందినట్లు ఏవో రమాదేవి తెలిపారు. అందులో కే-6 రకం విత్తనాలు 908 క్వింటాళ్లు, నారాయణి రకం విత్తనాలు 736 క్వింటాళ్లు ఉన్నట్లు ఆమె తెలిపారు. కే-6 విత్తనాల 30 కేజీల బస్తా ధర రూ.1674లు, నారాయణి రకం 30 కేజీల బస్తా ధరరూ.1710లుగా ప్రభుత్వం నిర్ణయించిందని ఆమె వివరించారు. విత్తనాల పంపిణీ ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన తెలియజేశారు.


మండలానికి వచ్చిన వేరుశనగ విత్తనాలు అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

రేపు ములకలచెరువులో జాబ్‌మేళా

ములకలచెరువు, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్లాసం డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి నాగార్జున తెలిపారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులు తమ సర్టిఫికేట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మదనపల్లె టౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండల సర్వసభ్య సమావేశంను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తాజ్ మస్రూర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు తప్పక హాజకు కావాలని కోరారు. వీరితో పాటు అన్ని ప్రభుత్వశాఖల మండల అధికారులు వారి వద్ద వున్న నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

దళితవాడలో తాగునీటి సమస్య

కలకడ, మే 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ ఎల్లంకివారిపల్లె దళితవాడ ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వారం రోజుల క్రితం బోరు చెడిపోవడంతో 40 కుటుంబాల వారు వ్యవసాయ బోర్లపై ఆధార పడుతున్నారు. ప్రయాసలు పడి ఊరికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న చేతి పంపు నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ నీరు కూడా రంగు మారడంతో తాగడానికి కష్టంగా ఉందని వాపోతున్నారు. ఈ విషయమై సచివాలయ సిబ్బందికి పలుమార్లు తెలిపిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతా ధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


చేతిపంపు వద్ద నీటి కోసం వేచిఉన్న గ్రామస్థులు

గంగమ్మ జాతరకు డీఎస్పీకి ఆహ్వానం

మదనపల్లె అర్బన్, మే29(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించనున్న కోర్టులో గంగమ్మ జాతరకు మదనపల్లె డీఎస్పీ మహేంద్రను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. జాతరకు అనుమతి మంజూరు చేయడంతోపాటు, ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు మార్పూరి ప్రభాకర్ నాయుడు, పెరవలి వేణుగోపాల్ నాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి మహేష్‌లు పాల్గొన్నారు.


డీఎస్పీని కలిసిన కోర్టులో గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు

ధర్నాను విజయవంతం చేయండి

బి.కొత్తకోట, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దారు కార్యాలయాల ఎదుట జూన్ 2న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బికొత్తకోట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఈ ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇంటి పట్టాలిచ్చినా, స్థలాలు చూపకుండా.. కట్టిన గృహాలకు బిల్లులు ఇవ్వకుండా వేధించిందన్నారు. ఆ ప్రభుత్వంలో ఇచ్చిన రూ.1.80 లక్షలు ఏ మూలకు సరిపోక ఎక్కడికక్కడ నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పేదలకు రెండు సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సరైన స్పందన లేకపోవడంపై ఆందోళను చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అశ్రఫ్ అలి, తంబయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు వెళ్తున్న బస్సుకు ప్రమాదం

రామసముద్రం, మే 29(ఆంధ్రజ్యోతి): మహానాడుకు వెళ్తున్న మినీ బస్సు ప్రమాదానికి గురైంది. మండలంలోని కేసీపల్లె, ఎంబాడి గ్రామానికి చెందిన మహిళలతో వెళ్తున్న బస్సు మదనపల్లె మండలం బొమ్మనచెరువు వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి ముందు వెళ్తు న్న ఆర్టీసీ బస్సును ఢీకొని అనంతరం చెట్టును ఢీకొట్టింది. వెంటనే మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ గౌడు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలకు ధైర్యం చెప్పి వారిని వేరే బస్సులో తరలించారు. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు లేవు.


చెట్టును ఢీకొన్న బస్సు